నేటి కందం- నేటికి అందం

కూరిమి మీరంగ జనుల
కేరింతలతోడ నింద్రకీలాద్రి పయిన్
తీరుగ దసరా యుత్సవ
మారంభమ్మయ్యెను పరమానందముతోన్ !!

(ఇంద్రకీలాద్రి మీద దసరా ఉత్సవాలు వైభవంగా ప్రారంభం అయ్యాయి)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com
ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433
E-mail : netinijam93@gmail.com

చురక

పరాధీనతే దేశానికి
ప్రధానంగా శత్రువు
స్వయం వృద్ధి సాధన
సంకల్పమే మిత్రువు.
అధినేతలు మాటలెన్నో
అద్భుతంగా అంటుంటరు
చేతలల్లో చిత్తశుద్ధి
చూపించక పోతుంటరు



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ మంగళవారం 23-9-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :32 సంచిక:38 పేజీలు:6 వెల: రూ.1/-


## దేశవ్యాప్తంగా జీఎస్టీ సేవింగ్ ఫెస్టివల్ మొదలైంది..

### -దేశ ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ లేఖ..!



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22:। జీఎస్టీ సేవింగ్ ఫెస్టివల్‌పై ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. జీఎస్టీ సంస్కరణలు ప్రస్తుతం వాటి ప్రభావాన్ని చూపిస్తున్నాయని.. దేశవ్యాప్తంగా 'జీఎస్టీ సేవింగ్ ఫెస్టివల్' ప్రారంభమైందని ప్రధానమంత్రి లేఖలో పేర్కొన్నారు. ఈ సంస్కరణలు ప్రజల పొదుపును పెంచుతాయని.. సమాజంలోని ప్రతి విభాగానికి ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరుస్తాయని తెలిపారు. జీఎస్టీ సంస్కరణలు వృద్ధి, పెట్టుబడులను పెంచుతాయని.. ప్రతి రాష్ట్రం, పురోగతిని వేగవంతం చేస్తాయన్నారు.

జీఎస్టీ సంస్కరణలు వ్యవస్థను సరళీకృతం చేశాయని, పన్ను రేట్లను తగ్గించాయని.. పొదుపుకు దారితీస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. స్వావలంబన భారతదేశం లక్ష్యం వైపు పురోగతిని నొక్కి చెప్పారు. జీఎస్టీ సంస్కరణలు స్థానిక తయారీని బలోపేతం చేస్తాయని తెలిపారు. దుకాణదారులు 'మేడ్ ఇన్ ఇండియా' ఉత్పత్తులను విక్రయించాలని.. 'మీరు ఏది కొన్నా స్వదేశీ.. మీరు ఏది అమ్మినా స్వదేశీ' అని గర్వంగా చెప్పాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పరిశ్రమ, తయారీని ప్రోత్సహించాలని.. పెట్టుబడి వాతావరణాన్ని మెరుగుపరచాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.

## యాదగిరిగుట్ట 34 రోజుల హుండీ ఆదాయం రూ. 2 కోట్ల 83 వేలు

యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు .ఆలయ ఈవో వెంకట్రావు తెలిపిన వివరాల ప్రకారం...34 రోజుల హుండీ మొత్తం నగదు రూపేణా ? 2,00,83,825-00(రెండు కోట్ల ఎనభై మూడు వేల ఎనమిది వందల ఇరువై ఐదు రూపాయలు ) వచ్చింది. మిశ్రమ బంగారం: 65-500 గ్రాములు, మిశ్రమ వెండి: 2 కిలోలు 800 గ్రాములు వచ్చినట్లు వివరించారు. విదేశీ కరెన్సీ విరాళం అమెరికా ? 540 డాలర్లు, ఇంగ్లాండ్ ?95 పౌండ్లు, నేపాల్ ? 10 రూపాయలు, సౌదీ అరేబియా ? 6 రియాల్, ఒమన్ ? 401 రియాల్, మలేసియా ? 40 రింగ్గిట్స్,యూరో ? 5 యూరోలు,యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ - 155,కెనడా ? 70 డాలర్, ఇరాక్ - 250 దినార్ లు మొక్కు భక్తుల ద్వారా వచ్చినట్లు వివరించారు.

## హైదరాబాద్‌లో కుండపోత వాన..రోడ్లన్ని జలమనం...

హైదరాబాద్, సెప్టెంబర్ 22: హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తున్నది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడుతున్నది. ఎల్బీనగర్, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిల్మ్‌నగర్, పంజాగుట్ట, ఖైరతాబాద్, ఎస్‌ఆర్‌నగర్, అమీర్‌పేట, ఎర్రగడ్డ, బోరబండ, సనత్‌నగర్, యూసఫ్‌గూడ ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తున్నది. బీఎన్‌రెడ్డినగర్, నానక్‌రామ్‌గూడతో పాటు పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. భారీగా కురిసిన వర్షాలతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులుపడ్డారు. రోడ్లపై భారీగా భారీగా నిలువడంతో వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. పలుచోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

అయితే, ఖైరతాబాద్, కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి, ఓయూ, ఎల్‌బీనగర్‌తో పాటు సహా ఉత్తర, పశ్చిమ, సెంట్రల్ హైదరాబాద్ పరిధిలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. ఇదిలా ఉండగా.. హైదరాబాద్‌తో పాటు జనగాం, కరీంనగర్, కామారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, సంగారెడ్డి, యాదాద్రి జిల్లాల్లో రాబోయే రెండుగంటల్లో వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. గంటకు



40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఉపరితల గాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. మరికొన్ని జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

## రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణం వేగవంతం చేయాలి: సీఎం రేవంత్

హైదరాబాద్, సెప్టెంబర్ 22:తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించి వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇవాళ(సోమవారం) మాట్లాడారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. రీజనల్ రింగ్ రోడ్డు ఉత్తర, దక్షిణ భాగాలతో పాటు రేడియల్ రోడ్ల నిర్మాణంపై అధికారులకు పలు సూచనలు చేశారు.

ఇందుకు అవసరమైన పెండింగ్ భూసేకరణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. హైదరాబాద్ నుంచి బందరు పోర్టు వరకు గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం అంశంపై సమీక్షలో చర్చించారు ముఖ్యమంత్రి. వీలైనంత త్వరగా రూట్ మ్యాప్‌పై తుది నిర్ణయం తీసుకోవాలని సూచించారు. హైదరాబాద్-శ్రీశైలం హైవేలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కేంద్రప్రభుత్వం నుంచి వీలైనంత త్వరగా అనుమతులు తీసుకోవాలని మార్గనిర్దేశం చేశారు సీఎం రేవంత్‌రెడ్డి.

జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని సంబంధిత జిల్లా కలెక్టర్లకు ఆదేశించారు. భూములు కోల్పోయిన రైతులకు వెంటనే పరిహారం అందించాలని దిశానిర్దేశం చేశారు. అక్టోబరు నెలాఖరు నాటికి పూర్తిస్థాయిలో భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. కోర్టు పరిధిలో ఉన్న భూ సమస్యల వివరాలను ఉన్నతాధికారులకు అందించి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

## అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వీసా రద్దు చేస్తామని హెచ్చరించడం విడ్డూరం

### - గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి

వరంగల్ సెప్టెంబర్ 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్);అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇటీవల హెచ్.1బి వీసాలపై కఠిన నిర్ణయం తీసుకోవడం, కంపెనీలపై 1 లక్ష (సుమారు రు.87 లక్షలు) భారాన్ని మోపడం, లేని పక్షంలో వీసా రద్దు చేస్తామని హెచ్చరించడం విడ్డూరం అని గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి తీవ్రంగా విమర్శించారు. ఈ తరహా నిర్ణయాలు భారతీయులపై తీవ్ర అన్యాయం జరిగే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ప్రధాని నరేందర్ మోడీ, సీఎం రేవంత్ రెడ్డి వెంటనే అమెరికా కంపెనీలను ఇండియాకు ఆహ్వానించాలన్నారు. ఆ కంపెనీలకు టాక్స్ మినహాయింపులు, ఫ్రీ స్థలాల కేటాయింపులు అందించాలన్నారు. ఈ నేపద్యం లో అమెజాన్ లాంటి కంపెనీ లను ఇండియా ప్రజలు బహిష్కరించాలని రాజనాల పిలుపునిచ్చారు. "ఇలా చేస్తేనే డోనాల్డ్ ట్రంప్ వెనక్కి తగ్గుతారు" అని రాజనాల పేర్కొన్నారు.

## హెచ్1బీ వీసా ఫీజు ఎఫెక్ట్.. ఐటీ షేర్లపై అమ్మకాల ఒత్తిడి.. నష్టాల్లో స్టాక్ మార్కెట్‌లు

న్యూ ఢిల్లీ సెప్టెంబర్ 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); నూతన హెచ్1బీ వీసా దరఖాస్తులపై లక్ష డాలర్ల (సుమారు రూ.88 లక్షలు) ను ఐటీ కంపెనీలు చెల్లించాలని అమెరికా ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిన నేపథ్యంలో.. ఐటీ షేర్లు ఒత్తిడికి గురయ్యాయి. ఇవాళ (సోమవారం) మధ్యాహ్నం 12.25 గంటల సమయంలో సెన్సెక్స్ 184 పాయింట్ల నష్టంతో 82,441 వద్ద.. నిఫ్టీ 31 పాయింట్లు క్షీణించి 25,295 వద్ద ట్రేడవుతోంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ కూడా కాస్తపడిపోయి 88.20కి చేరింది. ఇక నిఫ్టీ సూచీలో హీరో మోటోకార్ప్ లిమిటెడ్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, ట్రెంట్, ఆసియన్ పెయింట్స్, టాటా మోటార్స్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. టెక్ మహీంద్రా, టీసీఎస్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, అపోలో హాస్పిటల్స్, లార్సెన్ స్టాక్స్ నష్టాల్లో కొనసాగుతున్నాయి. టెక్ మహీంద్రా షేర్లు ఆరు శాతం పడిపోగా.. ఇన్ఫోసిస్, టీసీఎస్ షేర్లు కూడా అదే బాటలో ఉన్నాయి. హెచ్1బీ వీసా కొత్త నిబంధన భారతదేశపు ఐటీ రంగాన్ని కలవరపెడుతున్నది.

## తెలంగాణ రైజింగ్ కోర్ అర్బన్ అభివృద్ధిపై సీఎం రేవంత్ వీడియో కాన్ఫరెన్స్

హైదరాబాద్, సెప్టెంబర్ 22:తెలంగాణ రైజింగ్ కోర్ అర్బన్ ఏరియా అభివృద్ధిపై సంబంధిత అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇవాళ(సోమవారం) వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రతిపాదనలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు అధికారులు. ఐదు ప్రధాన అంశాల ప్రాతిపదికన అభివృద్ధి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు సీఎంకు వివరించారు అధికారులు.



ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు సీఎం రేవంత్‌రెడ్డి. వీధి వ్యాపారుల కోసం ప్రత్యేక వెండింగ్ జోన్స్‌ను ఏర్పాటు చేయాలని దిశానిర్దేశం చేశారు. మల్టీ స్టోరేజ్ బిల్డింగ్స్, ఫైర్ సేఫ్టీ అంశాలపై పలు సూచనలు చేశారు ముఖ్యమంత్రి. వీధి దీపాలకు సోలార్ విద్యుత్ వినియోగం, కొత్తగా పునరుద్ధరిస్తున్న చెరువుల వద్ద పైలట్ ప్రాజెక్టుగా సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు అంశాన్ని పరిశీలించాలని సీఎం సూచించారు. కోర్ అర్బన్ రీజియన్‌లో వీధుల ఆధునీకరణ, సుందరీకరణ చేపట్టాలని మార్గనిర్దేశం చేశారు సీఎం రేవంత్‌రెడ్డి.

కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు ముఖ్యమంత్రి. విద్యుత్ సబ్ స్టేషన్ల అప్ గ్రేడేషన్‌తో పాటు, విచ్చలవిడిగా ఉన్న ట్రాన్స్ ఫార్మర్లను స్ట్రీమ్ లైన్ చేసి రీ-లొకేట్ చేయాలని దిశానిర్దేశం చేశారు సీఎం. మంచినీటి, మురుగునీటి వ్యవస్థపై నిర్వహణ వేర్వేరుగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనుమతుల విషయంలో వివిధ విభాగాల మధ్య సమన్వయం ఉండేలా చూసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

## సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్ గ్రీన్ సిగ్నల్



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22:తెలంగాణ రాష్ట్రంలోని సమ్మక్కసాగర్ ప్రాజెక్ట్‌కు ఎన్‌ఓసీ ఇచ్చేందుకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాయ్‌పూర్‌లో సీఎం విష్ణు దేవ్ సాయిని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ కలిశారు. నీట మునిగే భూభాగం పరిహారం భరించేందుకు తెలంగాణ అంగీకారం తెలిపింది. ములుగు జిల్లాలో 6.7 టీఎంసీ సామర్థ్యంతో ఈ సమ్మక్క సాగర్ డ్యామ్ నిర్మాణం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్టు వల్ల నల్గొండ, వరంగల్‌లో తాగునీటి సమస్యలకు పరిష్కారం లభించనుంది. రామప్ప-పాకాల లింక్ కెనాల్ కింద కొత్తగా 12,146 ఎకరాలకు నీరు అందుతుంది. వరంగల్, సూర్యాపేట, మహబూబాబాద్, జనగాం, ఖమ్మం జిల్లాలకు లబ్ధి చేకూరుతుంది.

### ఎన్‌ఓసీ ఇచ్చేందుకు అంగీకారం

రాయ్‌పూర్‌లో సీఎం విష్ణు దేవ్ సాయిని కలిసిన మంత్రి ఉత్తమ్

నీటమునిగే భూభాగం పరిహారం భరించేందుకు తెలంగాణ అంగీకారం

6.7 టీఎంసీ సామర్థ్యంతో ములుగు జిల్లాలో నిర్మాణం

నల్గొండ, వరంగల్‌లో తాగునీటి సమస్యలకు సమ్మక్కసాగర్ పరిష్కారం

రామప్ప-పాకల లింక్ కెనాల్ కింద కొత్తగా 12,146 ఎకరాలకు నీరు

వరంగల్, సూర్యాపేట, మహబూబాబాద్, జంగావ్, ఖమ్మం జిల్లాలకు లబ్ధి

90 కిలోమీటర్ల టన్నెల్ నెట్‌వర్క్‌తో భారీ ఇంజనీరింగ్ డిజైన్

మూడు పంప్‌హౌసులు, క్రాస్ డ్రెయినేజ్ వర్క్స్ ప్రాజెక్ట్‌లో భాగం

ఛత్తీస్‌గఢ్‌లో 73 హెక్టార్ల భూభాగం నీట మునిగే అవకాశం

పరిహారం, పునరావాసం భరించేందుకు తెలంగాణ సిద్ధం అని తెలిపిన మంత్రి ఉత్తమ్

ఐఐటీ ఖరగ్‌పూర్ సబ్‌మెర్జెన్స్ స్టడీ ఫైండింగ్స్ అమలు చేస్తామన్న ఉత్తమ్

ఎన్‌ఓసీ జారీకి ముందే అడ్వాన్స్ చెల్లింపులు ఇవ్వడానికి తెలంగాణ సిద్ధం

## మిర్యాల కళమ్మకు సీఎం రిలీఫ్ ఫండ్ రు.24 వేల చెక్కు అందజేత

యదాద్రి భువనగిరి సెప్టెంబర్ 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సహాయక నిధుల నుండి భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ రు.24.000 (ఇరవై నాలుగు వేల రూపాయల ) చెక్ ను సోమవారం గొల్నేపల్లి గ్రామానికి చెందిన మిర్యాల కళమ్మకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పొలగోని యాదయ్య అంజయ్య. మిర్యాల దామోదర్. గంగాపురం ప్రవీణ్. గంగాపురం జంగయ్య. తదితరులు పాల్గొన్నారు.

## జీఎస్టీ తగ్గింపుతో సామాన్యులకు నేటి నుండి పండుగే..పండుగ..

హైదరాబాద్ , సెప్టెంబర్ 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: జీఎస్టీ రేట్ల తగ్గింపుతో సామాన్య ప్రజలు ముఖ్యంగా మహిళలు ఆనంద పడుతున్నారు. సామాన్య ప్రజలకి ఖర్చుల భారం తగ్గించేందుకు ప్రభుత్వం ఊూ రేట్లను తగ్గించింది. అలాగే తగ్గించిన ఊూ రేట్లు సోమవారం నుండి అమలు లోకి వచ్చాయి. ఊూ కేవలం రెండు శ్లాబ్‌లలో 5% లేదా 18% మాత్రమే ఉంటుంది.



### చౌకగా లభించే వస్తువుల జాబితా...

పాశ్చురైజెడ్ పాలు, వెన్న, నెయ్యి, వెన్న నూనె, పాల స్ప్రెడ్‌లు, పనీర్ (చీజ్), పనీర్ రోటీ, చపాతీ, పాపడ్, పాస్తా, నూడుల్స్, కౌస్కాస్, పేస్ట్రీలు, కేకులు, బిస్కెట్లు, కార్న్ ఫ్లెక్స్, స్టీల్ గిన్నెలు, నమ్కీన్, భుజియా, మిక్షర్ (ప్యాకేజ్ చేసినవి), సాస్‌లు, మసాలాలు, మసాలా పొడి, టీ, కాఫీ పౌడర్, షికోరి కాఫీ గింజలు, జామ్, జెల్లీ, మార్మాలాడే, కొబ్బరి నీళ్లు (ప్యాక్ చేసినవి), కండెన్సడ్ పాలు, టూత్ బ్రష్, డెంటల్-ఫ్లేట్ బ్రష్, టూత్‌పేస్ట్, పళ్ళ పొడి, టాయిలెట్ సబ్బు, షాంపూ, హెయిర్ ఆయిల్, షేవింగ్ క్రీమ్, షేవింగ్ లోషన్, ఆఫ్టర్ షేవ్, నేప్కిన్లు, పిజ్జా బ్రెడ్, పరాఠా, పరోటా బ్రెడ్, మట్టి గిన్నెలు, సిరామిక్ టేబుల్‌వేర్, కిచెన్‌వేర్, డ్రై ఫ్రూట్స్ ఖర్జూరాలు, అంజూర పండ్లు, పైనాపిల్, అవకాడో, మామిడి (ఎండినవి), సిట్రస్ పండ్లు (నారింజ, మాండరిన్లు, ద్రాక్షపండు, నిమ్మకాయలు) , ఇతర డ్రై ఫ్రూట్స్, గింజల మిశ్రమాలు (చింతపండు తప్ప), బ్రెజిల్ గింజలు, చక్కెర స్వీట్స్, చాక్లెట్, ఇతర బేకర్ల ఉత్పత్తులు, ఐస్ క్రీం, సూప్‌లు, రసం, టమోటా, పుట్టగొడుగుల నిల్వలు, వెనిగర్లో నానపెట్టిన కూరగాయలు, ఈస్ట్, బేకింగ్ పౌడర్, టెక్స్చురైజ్డ్ వెజిటబుల్ ప్రోటీన్, ఎక్స్‌ట్రూడెడ్ నమ్కీన్, కొబ్బరి వెన్న, కొబ్బరి నూనె,కొబ్బరి పొడి, మాల్ట్-బార్లీ, కూరగాయల రసాలు, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషీన్, టెలివిజన్ సెట్లు (అన్ని సైజులు) , ఎయిర్ కండిషనర్, మైక్రోవేవ్ ఓవెన్, ఇండక్షన్ కుక్కర్, రైస్ కుక్కర్, హీటర్, గ్రైండర్, మిక్సర్, జ్యూసర్, కుట్టు మెషిన్, వాక్యూమ్ క్లీనర్, ఇస్త్రీ పెట్టె, హెయిర్ డ్రైయర్, హెయిర్ స్ట్రెయిట్నర్, ఎలక్ట్రిక్ షేవర్, రూ.2500లోపు ఉన్న చెప్పుల ధర, కార్పెట్, వెదురు, మెటల్ ఫర్నిచర్, చెక్క ఫర్నిచర్, ప్లాస్టిక్ మోల్డెడ్ ఫర్నిచర్, గ్లాస్ గాజులు, కొవ్వొత్తులు, గొడుగులు, హ్యాండ్‌క్రాఫ్ట్ హ్యాండ్‌బ్యాగులు, పౌచ్‌లు, పర్సులు, హ్యాండ్‌బ్యాగులు, షాపింగ్ బ్యాగులు, చేతితో తయారు చేసిన శాలువాలు, టోపీలు, పెన్సిళ్లు, క్రేయాన్లు, పాస్టెల్లు, సుద్ద, రబ్బరు బ్యాండ్లు, ట్రైసైకిళ్లు, స్కూటర్లు, పెడల్ కార్లు, బొమ్మలు, ప్లేయింగ్ కార్డ్స్, చెస్ బోర్డు, క్యారమ్ బోర్డు, ఎడ్యుకేషనల్ టాయ్స్, పేపర్‌బోర్డ్, వ్యక్తిగత ఉపయోగం కోసం అన్ని మందులు, డయాగ్నస్టిక్ కిట్లు, రియాజెంట్లు, ఫీడింగ్ బాటిళ్లు, సర్జికల్ చేతి గ్లవుజులు, కాంటాక్ట్ లెన్సులు, టాల్కమ్ పౌడర్, ఫేస్ పౌడర్, సిమెంట్, జనపనార, వరి పొట్టు, జిప్సం, సిసల్, బాగస్సే, పత్తి కాండాలు, సిరామిక్ బిల్డింగ్ బ్రిక్స్, బ్లాక్స్, టైల్స్, తబలా, మృదంగం, వీణ, సితార్, ఫ్లూట్, షెహనాయ్, ఢోలక్, సైకిల్, డిష్ వాషర్, బైక్స్ (350ఇఇ వరకు), స్కూటర్లు, మోపెడ్‌లు, ఆటో, ఈ-రిక్షా,కార్లు (చిన్న ఇంకా మధ్య), విద్యుత్ వాహనాలు, అంబులెన్స్, బస్సులు, ట్రక్కులు, టైర్లు, ట్రాక్టర్ విడి భాగాలు, అగ్గిపుల్లలు ఇంకా కొన్ని ఇతర ఉన్నాయి.బి

### ఇవి పెరిగాయి వస్తువుల ధరలు

పాన్ మసాలా, అన్ని ఫ్లేవర్స్ లేదా స్వీట్ వాటర్, ఆల్కహాల్ లేని పానీయాలు, కార్బోనేటేడ్ పండ్ల పానీయాలు, కెఫిన్ ఉన్న పానీయాలు, మొక్కల ఆధారిత పాల పానీయాలు, ముడి పొగాకు, పొగాకు ఉన్న ఉత్పత్తులు, సిగార్లు, సిగరెట్లు పొగాకు/ నికోటిన్ ఉత్పత్తులు, బొగ్గు, బ్రికెట్లు, బొగ్గుతో తయారైన ఘన ఇంధనాలు, లిగ్నైట్, మెంథాల్ ఉత్పన్నాలు, బైక్స్ (350ఇఇ పైన), నాజులు, లగ్జరీ కార్లు, రివాల్వర్లు ఇంకా పిస్టల్స్, ప్రైవేట్ జెట్‌లు, వ్యాపార విమానాలు, హెలికాప్టర్లు, షిప్స్ ఉన్నాయి.

## నళిని కి మద్దతుగా నిలిచిన బిజెపి బృందం

### -ఇప్పటికైనా ఆమె రిటైర్మెంట్ ప్రయోజనాలను విడుదల చేయాలి
### - ఆమెను మానసిక వేదన నుండి బయటకు తీసుకోవాలని డిమాండ్
### -భువనగిరి నళిని స్వగృహానికి వెళ్లి పరామర్శించిన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు బృందం



హైదరాబాద్ సెప్టెంబర్ 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్):బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు మాజీ డీఎస్పీ నళినిని ఆమె స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా నళిని గారి ఆరోగ్య పరిస్థితి, ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి , మాజీ ఎంపీ, బిజెపి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. బూర నర్సయ్య గౌడ్ , సీనియర్ నాయకులు గూడూరు నారాయణ రెడ్డి , జిల్లా అధ్యక్షుడు అశోక్ గౌడ్ , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్ , ఇతర సీనియర్ నాయకులు ఉన్నారు. ఈ సందర్భంగా బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మీడియాతో మాట్లాడుతూనళిని తెలంగాణ ఉద్యమ సమయంలో పోలీస్ ఫోర్స్‌లో ఉన్నప్పటికీ జై తెలంగాణ నినాదంతో ఉద్యమానికి మద్దతు ఇచ్చి రాజీనామా చేశారన్నరు. నళిని రాజీనామా తర్వాత డిపార్ట్‌మెంట్ సస్పెండ్ చేసింది, కానీ ఇప్పటివరకు రావాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ విడుదల చేయలేదు. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నళిని గారిని ఇబ్బందులకు గురిచేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చినప్పటికీ, బెనిఫిట్స్ ఇంకా రిలీజ్ చేయలేదు. నళిని గారు 16 పేజీలలో రిపోర్ట్ సబ్మిట్ చేసి పరిస్థితులను వివరించినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ఇతర కారణాలు చెబుతూ బెనిఫిట్స్ విడుదల చేయడం లేదు. ఫలితంగా నళిని గారు మానసిక వేదనకు గురయ్యారు. ఆరోగ్యం క్షీణించిం ది. ఇటువంటి పరిస్థితుల్లో నళిని కి మద్దతుగా నిలుస్తూ... బిజెపి బృందం ఆమెను పరామర్శించడం జరిగింది. నళిని గారు రిటైర్మెంట్ వేతనం, ఇతర అధికారిక ప్రయోజనాలను సమాజ సేవ కోసం వినియోగిస్తానని తెలిపారు

# బధిరులకు వరంగా మారిన సంజ్ఞ భాష !

**(23 సెప్టెంబర్ "అంతర్జాతీయ సంజ్ఞ లేదా సంకేత భాషల దినోత్సవం" సందర్భంగా)**

సంజ్ఞ లేదా సంకేత భాష చెవిటి వారికి చదువు నేర్చుకోవడానికి, సమాచార వితరణకు, అభిప్రాయాలను వ్యక్తం చేయడానికి, మన ప్రత్యేకతను చాటు కోవడానికి, సమ్మిళిత అభివృద్ధికి మహా వరంగా మారింది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 300 వరకు "సంజ్ఞ భాషలు" లేదా "సైన్ లాంగ్వేజెస్" ఉన్నాయి. సంజ్ఞ భాషలకు ప్రత్యేక పదకోశం, విలక్షణ వ్యాకరణం ఉంటాయి. సంజ్ఞ భాషలకు ప్రధాన ఉదాహరణలుగా భారతీయ, అమెరికన్, బ్రిటీష్ సంకేత భాషలు వస్తాయి. సంజ్ఞ భాష వ్యక్తీకరణకు ముఖ కవళికలు, బాడీ లాంగ్వేజ్‌లు ప్రధానమైనవిగా గుర్తించబడ్డాయి. సంజ్ఞ భాషను నేర్చుకోవడం ద్వారా వినికిడి లోపం కలిగిన అభాగ్య దివ్యాంగుల సమస్యలు అర్థం చేసుకోవడంతో పాటు వారి పట్ల సహానుభూతి పెరుగుతుంది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 72 మిలియన్ల చెవిటి దివ్యాంగులు ఉన్నారు. సహజ సిద్ధమైన సంజ్ఞ భాషల పట్ల సాధారణ ప్రజల్లో అవగాహన చాలా తక్కువగా కనిపిస్తుంది. చెవిటి వారు ప్రజలతో మమేకం కావడం, ప్రయాణాలు చేయడం, విద్యాభ్యాసం, కమ్యూనికేషన్ చేయడం, సమావేశాలకు హాజరు కావడం లాంటి సందర్భాలకు సంకేత భాష ప్రయోగించబడుతుంది.

## వినికిడిలోపం కలిగిన దివ్యాంగులకు వరంగా సంజ్ఞ భాష:

చెవిటి తనకంతో బాధ పడుతున్న ప్రజలు ప్రజలతో మమేకం కావడానికి సంజ్ఞ భాష ఓ అద్భుత వరంగా మారింది. సంజ్ఞ భాష ప్రాధాన్యం గుర్తించిన ఐరాస 2017లో తీసుకున్న తీర్మానం ప్రకారం ప్రతి ఏట 23 సెప్టెంబర్ రోజున "అంతర్జాతీయ సంజ్ఞ భాష దినం (ఇంటర్నేషనల్ డే ఆఫ్ సైన్ లాంగ్వేజెస్)"ను పాటించడం జరుగుతున్నది. చెవిటి వ్యక్తులు, ముఖ్యంగా వినికిడిలోపం కలిగిన యువతకు సంజ్ఞ భాష ప్రాధాన్యం వివరిస్తూ, వారికి ఈ భాషను నేర్పడం విధిగా జరగాలి. స్థానిక స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు చెవిటి ప్రజల సమస్యలను చర్చిస్తున్న వేదికల సమన్వయంతో సంజ్ఞ భాషను ఉపయోగించడం, అభివృద్ధి చేయడం, ప్రచారం చేయడం కొనసాగుతున్నది. వినికిడిలోపం కలిగిన ప్రజలను సాధారణ జనజీవన స్రవంతిలో కలిసిపోవడానికి సంజ్ఞ భాష ఉపకరిస్తున్నది. అంతర్జాతీయ సంజ్ఞ భాషల దినం-2025 ఇతివృత్తంగా "ప్రజలకు ఐక్యం చేస్తున్న సంజ్ఞ భాష(సైన్ లాంగ్వేజ్ యునైట్స్ అజ్)" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ దినోత్సవ వేదికల్లో అవగాహన కల్పించడం, చెవిటి నిపుణుల ప్రసంగాలు ఏర్పాటు చేయడం, సంజ్ఞ భాష గూర్చి తెలుసుకోవడం, సైన్ లాంగ్వేజ్ క్లబ్బులు ఏర్పాటు చేయడం లాంటివి నిర్వహిస్తారు.

సాధారణ పౌర సమాజంతో చెవిటి వారిని అనుసంధానించడానికి సంజ్ఞ భాషలు చక్కగా ఉపయోగపడుతున్నాయి. మాటల్లో చెప్పలేని అద్భుత భావాలను సంజ్ఞలతో వ్యక్తం చేయడం ఓ అపురూప సందర్భం. సంజ్ఞ భాష ఒక కమ్యూనికేషన్ సాధనమే కాదు, అది రెండు హృదయాల కలయిక అవి తెలుసుకోవాలి. అందరితో సమానంగా విద్యను అభ్యసించడానికి సంజ్ఞ భాష దోహదపడుతున్నది. వినికిడా లోప దివ్యాంగుల మానవ హక్కుల పరిరక్షణలో సంజ్ఞ భాషలు సదా ఉపయోగపడుతున్నాయి. అన్ని అవయవాలు చక్కగా ఉన్న ప్రజలు సంజ్ఞ భాషలోని మౌళిక అంశాలను చేర్చుతొని, ఆ వర్గం ప్రజలతో సరదాగా మాట్లాడుదాం, మేం ఉన్నామన్న ధైర్యాన్ని అందిద్దాం.

-డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# దేశ శ్రేయస్సుకు ముఖద్వారాలుగా మారనున్న భారత తీరప్రాంతాలు: ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22:గుజరాత్‌లోని భావ్‌నగర్‌లో రూ. 34,200 కోట్లకు పైగా విలువైన పలు అభివృద్ధి పనులను ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు ప్రారంభించారు. మరికొన్ని పనులకు శంకుస్థాపన చేశారు. 'సముద్ర సే సమృద్ధి' కార్యక్రమంలో ప్రసంగిస్తూ.. ఈ కార్యక్రమంలో ప్రముఖులు, ప్రజల భాగస్వామ్యాన్ని ప్రధానమంత్రి స్వాగతించారు. ఈ నెల 17న తనకు పంపిన పుట్టినరోజు శుభాకాంక్షలకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజల ప్రేమాభిమానాలు గొప్ప బలమన్నారు. దేశంలో విశ్వకర్మ జయంతి నుంచి గాంధీ జయంతి వరకు అంటే ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు సేవా పఖ్వాడా నిర్వహిస్తున్నట్లు ప్రధానమంత్రి తెలిపారు. గత 2-3 రోజుల్లో గుజరాత్‌లో అనేక సేవా కార్యక్రమాలు.. వందలాది ప్రదేశాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించారన్నారు. ఇప్పటివరకు ఒక లక్ష మంది రక్తదానం చేశారని ప్రధానమంత్రి వెల్లడించారు. అనేక నగరాల్లో నిర్వహించిన పరిశుభ్రతా కార్యక్రమాల్లో లక్షలాది మంది పౌరులు చురుగ్గా పాల్గొంటున్నారని ఆయన అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 30,000 కి పైగా ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేశామనీ, ప్రజలకు.. ముఖ్యంగా మహిళలకు ఉచితంగా వైద్య పరీక్షలు, చికిత్స అందిస్తున్నామని శ్రీ మోదీ తెలియజేశారు. దేశవ్యాప్తంగా సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ ప్రశంసిస్తూ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

మొదట స్వర్గీయ కృష్ణకుమార్‌సిన్హ్‌కి నివాళులు అర్పించిన ప్రధానమంత్రి.. ఆయన గొప్ప వారసత్వాన్ని గుర్తుచేసుకున్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ లక్ష్యానికి అనుగుణంగా భారత ఐక్యతకు కృష్ణకుమార్‌సిన్హ్ గారు ఎంతో కృషి చేశారన్నారు. అటువంటి గొప్ప దేశభక్తుల స్ఫూర్తితో దేశం ఐక్యతా స్ఫూర్తిని బలోపేతం చేస్తూనే ఉందని వ్యాఖ్యానించారు. ఈ సమష్టి ప్రయత్నాల ద్వారా ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ సంకల్పం మరింత బలోపేతం అవుతోందని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

పవిత్ర నవరాత్రి పండుగ ప్రారంభం కానున్న సమయంలో తాను భావ్‌నగర్‌కు వచ్చానని ప్రస్తావించిన శ్రీ మోదీ.. జీఎస్టీ తగ్గింపు కారణంగా మార్కెట్లలో మరింత ఉత్తేజం.. పండుగ ఉత్సాహం ఉంటుందని తెలిపారు. ఈ పండుగ సంబరాలతో పాటుగా మన దేశం సముద్ర సే సమృద్ధి పండుగనూ గొప్పగా నిర్వహిస్తోందని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. 21వ శతాబ్దపు భారత్.. సముద్రాన్ని అవకాశాలకు ప్రధాన మార్గంగా చూస్తుందని ఆయన స్పష్టం చేశారు. వేల కోట్ల విలువైన ప్రాజెక్టులు ఇప్పుడే ప్రారంభించుకున్నామనీ.. నౌకాశ్రయ ఆధారిత అభివృద్ధి వేగవంతం కోసం పలు శంకుస్థాపనలూ చేసినట్లు శ్రీ మోదీ తెలిపారు. క్రూయిజ్ టూరిజాన్ని ప్రోత్సహించడానికి ముంబయిలోని అంతర్జాతీయ క్రూయిజ్ టెర్మినల్ ఈ రోజు ప్రారంభమైందన్నారు. భావ్‌నగర్, గుజరాత్‌తో అనుసంధానమైన పలు అభివృద్ధి ప్రాజెక్టులూ ప్రారంభమయ్యాయని ప్రధానమంత్రి వెల్లడించారు. ఈ సందర్భంలో గుజరాత్ పౌరులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

"ప్రపంచంతో సోదరభావ స్ఫూర్తిని భారత్ కొనసాగిస్తోంది. ప్రపంచంలో ప్రస్తుతం మన దేశానికి ప్రధాన శత్రువు ఎవరూ లేరు. దేశానికి అతిపెద్ద శత్రువు నిజానికి ఇతర దేశాలపై ఆధారపడటమే" అని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. ఇతర దేశాలపై ఆధారపడటాన్ని సమష్టిగా ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. విదేశాలపై ఆధారపడటం ఎక్కువగా జాతీయ వైఫల్యానికి దారితీస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. ప్రపంచ శాంతి, సుస్థిరత, శ్రేయస్సు కోసం ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశం స్వయం-సమృద్ధిని సాధించడం తప్పనిసరి అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. ఇతరులపై ఆధారపడటం జాతి ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తుందన్నారు. 140 కోట్ల మంది భారతీయుల భవిష్యత్తును బాహ్య శక్తులకు వదిలేయలేమనీ.. జాతి అభివృద్ధి సంకల్పం కోసం విదేశాలపై ఆధారపడకూడదని శ్రీ మోదీ స్పష్టం చేశారు. రాబోయే తరాల భవిష్యత్తును ప్రమాదంలో పడేయకూడదన్నారు. వంద సమస్యలకు పరిష్కారం స్వయం-సమృద్ధ భారత్‌ను నిర్మించడమేనని ఆయన ప్రకటించారు. దీనిని సాధించడానికి దేశం సవాళ్లను ఎదుర్కోవాలి.. విదేశాలపై ఆధారపడటాన్ని తగ్గించాలి.. నిజమైన స్వయం-సమృద్ధిని సాధించాలని ప్రధానమంత్రి ఉద్ఘాటించారు.

భారత్‌లో ఎప్పుడూ సామర్థ్య లోపం లేదని స్పష్టం చేసిన శ్రీ మోదీ.. స్వాతంత్ర్యానంతరం అధికారంలోకి వచ్చిన పార్టీ దేశ స్వాభావిక బలాలను నిరంతరం విస్మరించిందని విమర్శించారు. ఫలితంగా ఆరు నుంచి ఏడు దశాబ్దాల తర్వాత కూడా భారత్ తన సామర్థ్యానికి తగిన విజయాన్ని సాధించలేకపోయిందన్నారు. లైసెన్స్-కోటా పాలనలో దీర్ఘకాలిక సమస్యలు, ప్రపంచ మార్కెట్లలో ఒంటరి కావడం దీనికి ప్రధాన కారణాలుగా శ్రీ మోదీ వివరించారు. ప్రపంచీకరణ యుగం వచ్చినప్పుడు అప్పటి పాలక ప్రభుత్వాలు దిగుమతులపైనే దృష్టి సారించాయనీ.. ఇది వేల కోట్ల కుంభకోణాలకు దారితీసిందని ఆయన తెలిపారు. ఈ విధానాలు భారత యువతకు ఎంతో హాని కలిగించాయన్న ప్రధానమంత్రి.. మన దేశపు అసలైన సామర్థ్యం వెలుగులోకి రాకుండా ఇవి నిరోధించాయన్నారు.

లోపభూయిష్ట విధానాల వల్ల కలిగే నష్టానికి భారత జలరవాణా రంగాన్ని ఒక ప్రధాన ఉదాహరణగా ఉటంకించిన ప్రధానమంత్రి.. భారత్ చరిత్రాత్మకంగా ఒక ప్రముఖ సముద్ర శక్తిగా, ప్రపంచంలోనే అతిపెద్ద నౌకా నిర్మాణ కేంద్రాల్లో ఒకటిగా ఉందని వ్యాఖ్యానించారు. భారత తీరప్రాంత రాష్ట్రాల్లో నిర్మించిన నౌకలు ఒకప్పుడు దేశీయ, అంతర్జాతీయ వాణిజ్యానికి ఊతమిచ్చాయని తెలిపారు. యాభై సంవత్సరాల కిందట కూడా భారత్ దేశీయంగా నిర్మించిన నౌకలనే ఉపయోగించిందన్నారు. 40 శాతానికి పైగా దిగుమతి-ఎగుమతులు వాటి ద్వారానే జరిగాయని శ్రీ మోదీ తెలియజేశారు. తరువాతి కాలంలో వారి తప్పుడు విధానాలకు జలరవాణా రంగం బలైపోయిందన్నారు. దేశీయ నౌకానిర్మాణాన్ని బలోపేతం చేయడానికి బదులుగా వారు విదేశీ నౌకలకు సరుకు రవాణా చార్జీలు చెల్లించడానికే మొగ్గుచూపారని ప్రధానమంత్రి ప్రస్తుత ప్రతిపక్ష పార్టీని విమర్శించారు. ఇది భారత నౌకానిర్మాణ రంగం పతనానికి, విదేశీ నౌకలపై బలవంతంగా ఆధారపడటానికి దారితీసిందని శ్రీ మోదీ వివరించారు. ఫలితంగా వాణిజ్యంలో భారతీయ నౌకల వాటా 40 శాతం నుంచి కేవలం 5 శాతానికి పడిపోయిందన్నారు. భారత్ వాణిజ్యంలో 95 శాతం విదేశీ నౌకలపై ఆధారపడిందనీ.. ఇది దేశానికి గణనీయ నష్టాన్ని కలిగించిందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు.

దేశ ప్రజలకు కొన్ని గణాంకాలను వెల్లడిస్తూ.. ప్రతి సంవత్సరం విదేశీ షిప్పింగ్ కంపెనీలకు భారత్ దాదాపు 75 బిలియన్ డాలర్లు అంటే సుమారు ఆరు లక్షల కోట్ల రూపాయలు చెల్లిస్తున్నట్లు తెలిస్తే ఆశ్చర్యపోతారని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. ఈ మొత్తం భారత ప్రస్తుత రక్షణ బడ్జెట్‌కు దాదాపు సమానమని ప్రధానమంత్రి తెలిపారు. గత ఏడు దశాబ్దాలుగా భారత్ సరుకు రవాణా కోసం ఇతర దేశాలకు ఎంత డబ్బు చెల్లించిందో ఒకసారి ఊహించుకోవాలని ఆయన ప్రజలను కోరారు. ఈ నిధుల ప్రవాహం విదేశాల్లో లక్షలాది ఉద్యోగాలను సృష్టించిందన్నారు. ఈ ఖర్చులో ఒక చిన్న భాగాన్ని మునుపటి ప్రభుత్వాలు భారత జలరవాణా రంగంలో పెట్టుబడి పెట్టి ఉంటే.. నేడు ప్రపంచమంతా భారత నౌకలను ఉపయోగిస్తుండేదని తెలిపారు. భారత్ జలరవాణా సేవల ద్వారా లక్షల కోట్లు ఆదాయమూ పొందేదని శ్రీ మోదీ అన్నారు.

"2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే స్వయం-సమృద్ధిని సాధించాల్సి ఉంటుంది. దీనికి ప్రత్యామ్నాయం లేదు. దీనికోసం 140 కోట్ల మంది పౌరులంతా ఒకే సంకల్పానికి కట్టుబడి ఉండాలి. చిప్స్ అయినా.. ఓడలు అయినా.. అవి భారత్‌లోనే తయారు కావాలి" అని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. ఈ దార్శనికతతో భారత సముద్ర రంగం ఇప్పుడు తదుపరి తరం సంస్కరణల వైపు పయనిస్తోందని వ్యాఖ్యానించారు. నేటి నుంచి దేశంలోని అన్ని ప్రధాన ఓడరేవులు అనేక పత్రాల అవసరాలు.. సంక్లిష్ట ప్రక్రియల నుంచి విముక్తి పొందుతాయని ఆయన ప్రకటించారు. 'ఒకే దేశం, ఒకే పత్రం', 'ఒకే దేశం, ఒకే ఓడరేవు' ప్రక్రియ అమలుతో వ్యాపార వాణిజ్యాలు సులభతరం అవుతాయన్నారు. వలసరాజ్యాల కాలం నుంచి అమలవుతున్న కాలం చెల్లిన అనేక చట్టాలను ఇటీవలి పార్లమెంటు వర్షాకాల సమావేశాల సందర్భంగా సవరించిన సంగతిని శ్రీ మోదీ గుర్తు చేశారు. సముద్ర రంగంలో వరుస సంస్కరణలు ప్రారంభించామనీ.. అయిదు సముద్ర చట్టాలను కొత్త రూపంలో ప్రవేశపెట్టామని ఆయన తెలియజేశారు. ఈ చట్టాలు జలరవాణా, ఓడరేవుల నిర్వహణలో ప్రధాన మార్పులను తీసుకువస్తాయని ప్రధానమంత్రి ఆకాంక్షించారు.

శతాబ్దాలుగా భారత్ పెద్ద నౌకలను నిర్మించే నైపుణ్యం కలిగి ఉందనీ.. తదుపరి తరం సంస్కరణలు ఈ మరుగునపడిన వారసత్వాన్ని పునరుద్ధరించడంలో సహాయపడతాయని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. గత దశాబ్దంలో 40కి పైగా నౌకలు, జలాంతర్గాములను నావికాదళంలో చేర్చామనీ.. వాటిలో ఒకటీ-రెండు తప్ప అన్నీ భారత్‌లోనే తయారైనవని శ్రీ మోదీ తెలిపారు. భారీ నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ కూడా దేశంలోనే తయారైందనీ.. దాని నిర్మాణంలో ఉపయోగించే అత్యంత నాణ్యమైన ఉక్కు కూడా భారత్‌లోనే ఉత్పత్తి అయిందన్నారు. భారత్ సామర్థ్యాన్నీ, మంచి నైపుణ్యాన్నీ కలిగి ఉందన్న ప్రధానమంత్రి.. పెద్ద నౌకలను నిర్మించడానికి అవసరమైన రాజకీయ సంకల్పమూ దృఢంగా ఉందని ఆయన దేశానికి భరోసానిచ్చారు.

భారత సముద్ర రంగ బలోపేతం కోసం నిన్న ఒక చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నామని తెలిపిన శ్రీ మోదీ.. ఒక కీలక విధాన సంస్కరణను ప్రకటించారు. దీని కింద పెద్ద నౌకలకు ఇప్పుడు మౌలిక సదుపాయాల హోదా కల్పించారు. ఒక రంగానికి మౌలిక సదుపాయాల గుర్తింపు లభించినప్పుడు, అది గణనీయమైన ప్రయోజనాలను పొందుతుందని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. ఓడ నిర్మాణ సంస్థలు ఇప్పుడు బ్యాంకుల నుంచి రుణాలు పొందడమూ సులభం అవుతుందనీ.. తగ్గిన వడ్డీ రేట్ల ప్రయోజనం కూడా ఉంటుందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. మౌలిక సదుపాయాల ఫైనాన్సింగ్‌తో సంబంధం ఉన్న అన్ని ప్రయోజనాలు ఇప్పుడు ఈ నౌకా నిర్మాణ సంస్థలకూ అందుబాటులో ఉంటాయన్నారు. ఈ నిర్ణయం భారత జలరవాణా కంపెనీలపై ఆర్థిక భారాన్ని తగ్గిస్తుందని తెలిపారు. ప్రపంచ మార్కెట్‌తో మరింత సమర్థంగా పోటీ పడటానికి ఇది సహాయపడుతుందని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

భారత్‌ను నౌకా వాణిజ్యంలో ఒక ప్రధాన శక్తిగా మార్చేందుకు ప్రధానంగా మూడు పథకాలపై ప్రభుత్వం దృష్టి సారించిందని ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ ప్రముఖంగా చెప్పారు. ఈ కార్యక్రమాలు నౌకా నిర్మాణ రంగంలో ఆర్థిక సహాయాన్ని మరింత సులభతరం చేస్తాయని.. నౌకాశ్రయాలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవటాన్ని, డిజైన్- నాణ్యతా ప్రమాణాలను మెరుగుపరుస్తాయని ఆయన పేర్కొన్నారు. రాబోయే సంవత్సరాల్లో ఈ పథకాల ద్వారా రూ. 70,000 కోట్లకు పైగా పెట్టుబడి పెట్టనున్నట్లు తెలియజేశారు.

2007లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గుజరాత్‌లో నౌకా నిర్మాణ అవకాశాల గురించి ఒక సెమినార్ నిర్వహించిన విషయాన్ని గుర్తు చేసిన ప్రధాని మోదీ.. ఆ కాలంలోనే నౌకా నిర్మాణ వ్యవస్థ అభివృద్ధి చెందేందుకు గుజరాత్ రాష్ట్రం మద్దతిచ్చిందని అన్నారు. ఇప్పుడు దేశవ్యాప్తంగా నౌకా నిర్మాణాన్ని ప్రోత్సహించడానికి సమగ్ర చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. నౌకానిర్మాణం సాధారణ పరిశ్రమ కాదన్న ఆయన.. పలు రకాల అనుబంధ రంగాల వృద్ధిని ఇది నడిపిస్తుందని, ఈ రంగాన్ని ప్రపంచవ్యాప్తంగా "పరిశ్రమలకు తల్లి"గా పిలుస్తారని తెలిపారు. ఉక్కు, యంత్రాలు, ఎలక్ట్రానిక్స్, వస్త్రాలు, పెయింట్లు, ఐటీ వ్యవస్థలు వంటి పరిశ్రమలన్నీ సరకు రవాణా రంగం ద్వారా మద్దతు పొందుతున్నాయని అన్నారు. ఇది చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈ) ఎక్కువగా ప్రయోజనం చేకూరుస్తోందని పేర్కొన్నారు. నౌకా నిర్మాణంలో పెట్టుబడి పెట్టే ప్రతి రూపాయి దాదాపు రెట్టింపు ఆర్థిక రాబడిని ఇస్తుందన్న పరిశోధన నివేదికలను ఆయన ప్రస్తావించారు. నౌకాశ్రయంలో సృష్టించే ప్రతి ఉద్యోగం సరఫరా వైపు ఆరు నుంచి ఏడు కొత్త ఉద్యోగాలకు దారితీస్తుందని తెలిపారు. దీన్నిబట్టి నౌకా నిర్మాణంలో 100 ఉద్యోగాలు సంబంధిత రంగాల్లో 600 కంటే ఎక్కువ ఉద్యోగాలకు దారితీస్తాయన్న ఆయన.. ఇది నౌకానిర్మాణ పరిశ్రమ చూపించే ఎన్నో రెట్ల ప్రభావాన్ని తెలియజేస్తోందని పేర్కొన్నారు.

నౌకా నిర్మాణానికి అవసరమైన నైపుణ్యాలను పెంచేందుకు పనులు కొనసాగుతున్నాయని ప్రధానమంత్రి మోదీ అన్నారు. ఈ కార్యక్రమాల్లో దేశంలోని పారిశ్రామిక శిక్షణ సంస్థలు (ఐటీఐ) కీలక పాత్ర పోషిస్తాయని, మారిటైమ్ విశ్వవిద్యాలయం పరిధి మరింత పెరుగుతుందని తెలిపారు. ఇటీవల సంవత్సరాలలో తీరప్రాంతాలలో నౌకాదళం, ఎన్‌సీసీల మధ్య సమన్వయం ద్వారా కొత్త పని విధానం తయారైనట్లు చెప్పారు. ఎన్‌సీసీ కేడెట్లు ఇప్పుడు నావికా దళానికి సంబంధించిన బాధ్యతలను మాత్రమే కాకుండా సముద్ర వాణిజ్య రంగంలో కూడా బాధ్యతలు తీసుకునేందుకు సిద్ధంగా ఉంటారని ఆయన అన్నారు.

నేటి భారతదేశం ఒక ప్రత్యేకమైన ఉత్తేజంతో ముందుకు సాగుతోందనీ, దేశం ప్రతిష్ఠాత్మక లక్ష్యాలను నిర్దేశించుకోవడమే కాకుండా వాటిని నిర్దేశించున్న సమయానికంటే ముందుగానే సాధిస్తోందని ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. సౌర విద్యుత్ రంగంలో నాలుగు నుంచి అయిదు సంవత్సరాల కంటే ముందుగానే భారత్ లక్ష్యాలను చేరుకుంటోంది. ఓడరేవుల ఆధారిత అభివృద్ధి విషయంలో పదకొండు సంవత్సరాల కిందట నిర్దేశించుకున్న లక్ష్యాలను అద్భుతంగా సాధిస్తున్నట్లు తెలిపారు. పెద్ద నౌకల కోసం దేశ వ్యాప్తంగా భారీ ఓడరేవులను అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్న ఆయన.. సాగరమాల వంటి కార్యక్రమాల ద్వారా అనుసంధానతను పెంచుతున్నట్లు తెలియజేశారు.

గత పదకొండు సంవత్సరాలలో భారతదేశంలో ఓడరేవుల సామర్థ్యం రెట్టింపు అయిందని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గుర్తు చేశారు. 2014కి ముందు భారత్‌లో ఓడల తిరుగు ప్రయాణ సమయం సగటున రెండు రోజులుగా ఉండేదని.. నేడు ఒక రోజు కంటే తగ్గిందని తెలిపారు. దేశవ్యాప్తంగా కొత్త, పెద్ద ఓడరేవులను నిర్మిస్తున్నట్లు తెలియజేశారు. కేరళలో ఉన్న దేశంలోని మొట్టమొదటి డీప్-వాటర్ కంటైనర్ ట్రాన్స్-షిప్మెంట్ ఓడరేవు ఇటీవలే కార్యకలాపాలు ప్రారంభించిదన్నారు. మహారాష్ట్రలోని వాధవన్ ఓడరేవును రూ. 75,000 కోట్లకు పైగా ఖర్చుతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపిన ఆయన.. ఇది ప్రపంచంలోని పది పెద్ద ఓడరేవులలో ఒకటిగా నిలుస్తుందని ప్రకటించారు.

ప్రస్తుత ప్రపంచ సముద్ర వాణిజ్యంలో భారత్ 10 శాతం వాటాను కలిగి ఉందని తెలిపిన మోదీ.. దీనిని పెంచాల్సిన అవసరాన్ని చెప్పారు. 2047 నాటికి ప్రపంచ సముద్ర వాణిజ్యంలో దేశం వాటాను మూడు రెట్లు పెంచాలన్న లక్ష్యంతో ఉన్నట్లు తెలిపారు. భారత్ దీనిని సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

సముద్ర వాణిజ్యం విస్తరిస్తోన్న కొద్దీ భారతీయ నావికుల సంఖ్య కూడా పెరుగుతోందని ప్రధాని అన్నారు. ఈ నిపుణులను ఓడలను నడిపే, ఇంజిన్లు- యంత్రాలను నిర్వహణను చూసుకునే, సముద్రంలో సరకు లోడింగ్- అన్‌లోడ్ కార్యకలాపాలను పర్యవేక్షించే విషయంలో కష్టపడి పనిచేస్తారని తెలిపారు. దశాబ్దం కిందట భారత్‌లో 1.25 లక్షల కంటే తక్కువ మంది నావికులు ఉన్నారు. నేడు ఈ సంఖ్య మూడు లక్షలు దాటింది. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక సంఖ్యలో నావికులను అందించే దేశాల్లో భారత్ ఇప్పుడు మొదటి మూడు దేశాల్లో ఒకటిగా ఉందని చెప్పారు. భారత నౌకానిర్మాణ పరిశ్రమ వృద్ధి చెందటం వల్ల ప్రపంచానికి కూడా ఉపయోగం ఉంటుందన్నారు.

సముద్రాల విషయంలో గొప్ప వారసత్వాన్ని భారత్ కలిగి ఉందన్న ఆయన.. మత్స్యకారులు, పురాతన ఓడరేవు నగరాలు దీనికి ప్రతీకగా నిలుస్తున్నాయని ప్రముఖంగా ప్రస్తావించారు. భావ్‌నగర్, సౌరాష్ట్ర ప్రాంతాలు ఈ ఘన వారసత్వానికి ప్రముఖ ఉదాహరణలని తెలిపారు. ఈ వారసత్వాన్ని భవిష్యత్ తరాలు, ప్రపంచం కోసం సంరక్షించడం, ప్రదర్శించటం అనే అంశాలకు ఉన్న ప్రాముఖ్యతను చెప్పారు. లోథాల్‌లో ప్రపంచ స్థాయి సముద్ర మ్యూజియం ఏర్పాటవుతోందని ఆయన.. ఇది కూడా ఐక్యతా విగ్రహం మాదిరిగా భారతదేశ గుర్తింపుకు కొత్త చిహ్నంగా మారుతుందన్న విశ్వాసం వ్యక్తం చేశారు.

"భారత్ తీరప్రాంతాలు జాతీయ శ్రేయస్సుకు ముఖద్వారాలుగా మారతాయి" అని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. గుజరాత్ సముద్ర తీరం మరోసారి ఈ ప్రాంతానికి ఒక వరంలా మారతోందన్న ఆయన.. దీనిపై సంతోషం వ్యక్తం చేశారు. దేశంలో ఓడరేవు ఆధారిత అభివృద్ధి విషయంలో ఇప్పుడు ఈ ప్రాంతం మొత్తం కొత్త ప్రామాణికతను నిర్దేశిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. భారతదేశంలో సముద్ర మార్గాల ద్వారా వచ్చే సరుకులో 40 శాతం గుజరాత్ ఓడరేవుల నుంచే వెళ్తోందన్న ఆయన.. ఈ ఓడరేవులు త్వరలో రానున్న ప్రత్యేక సరుకు రవాణా కారిడార్ ద్వారా ప్రయోజనం పొందుతాయని ప్రముఖంగా పేర్కొన్నారు. ఈ కారిడార్.. వస్తువులను దేశంలోని ఇతర ప్రాంతాలకు వేగంగా తరలించడానికి వీలు కల్పించటంతో పాటు ఓడరేవు సామర్థ్యాన్ని మరింత పెంచుతుంది.

నౌకలను తుక్కుగా మార్చే బలమైన వ్యవస్థ ఈ ప్రాంతంలో తయారువుతోందని తెలిపిన ఆయన.. అలంగ్‌లో ఉన్న నౌకా విధ్వంసక యార్డ్ (షిప్ బ్రేకింగ్ యార్డ్) దీనికి ప్రధాన ఉదాహరణగా నిలుస్తోందని అన్నారు. ఈ రంగం యువతకు గణనీయమైన ఉపాధి అవకాశాలను సృష్టిస్తోందని వ్యాఖ్యానించారు.

అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించాలంటే అన్ని రంగాలలో వేగవంతమైన పురోగతి అవసరమని ప్రధానమంత్రి చెప్పారు. అభివృద్ధి చెందిన భారత్‌కు మార్గం స్వావలంబనేనని పునరుద్ఘాటించారు. కొనుగోలు చేసే వాటితో పాటు విక్రయించేవి కూడా స్వదేశీనే అయి ఉండాలన్న విషయాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలని ఆయన కోరారు. "ఇది స్వదేశీ అని గర్వంగా చెప్పండి" అని రాసి ఉన్న బోర్డులను దుకాణాల్లో ప్రదర్శించాలని దుకాణదారులకు విన్నవించారు.

# గీత కార్మికుల పెండింగ్ ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి : బాలగోని జయరాములు



నల్గొండ, సెప్టెంబర్ 20:రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేసియా నిధులు విడుదల చేసి బాధిత గీత కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలగోని జయరాములు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం రాజాపేట పట్టణంలోని ఎన్ కే ఫంక్షన్ హాల్‌లో కేజీకేఎస్ సంఘం మండలాధ్యక్షుడు పాండవుల లక్ష్మణ్ గౌడ్ అధ్యక్షతన కల్లుగీత కార్మిక సంఘం మండల ఆరవ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వైన్ షాపుల్లో గీత కార్మికులకు 25 శాతం వాటా కేటాయించాలన్నారు. గీత కార్మికులు నిత్యం ప్రమాదాలు అంచున తమ జీవనం కొనసాగిస్తున్నప్పటికీ, గీత కార్మికుల సంక్షేమానికి గాని, గీత వృత్తిని ఆధునీకరించడానికి గానీ ప్రభుత్వం ప్రయత్నం చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

తెలంగాణ రాష్ట్రంలో గత సంవత్సరం ప్రమాదవశాత్తు తాటి చెట్లపై నుండి క్రింద పడి మృతి చెందిన, గాయపడిన కుటుంబాలకు రావాల్సిన ఎక్స్‌గ్రేషియా ఇప్పటివరకు ప్రభుత్వం విడుదల చేయకపోవడం వల్ల బాధిత కుటుంబాలు దుర్భర పరిస్థితిలో ఉన్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు విడుదల చేసి బాదిత కుటుంబాలకు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా అధ్యక్షుడు రాగీర్ కృష్ణయ్య మాట్లాడుతూ.. వృత్తిలో ప్రమాదాలు నివారించడానికి ఇస్తామన్న కాటమయ్య రక్షణ కిట్లు జిల్లాలో 600 మందికి మాత్రమే ఇచ్చారని, తక్షణమే గీత కార్మికులందరికీ అందించాలన్నారు. కల్లుగీత కార్మికులకు ఇస్తున్న వృద్ధాప్య పెన్షన్ రూ.4 వేలకు పెంచాలన్నారు. అలాగే ప్రతి గీత కార్మికుడికి మోటార్ సైకిల్ ఇవ్వాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపగాని బాలమణి యాదగిరి గౌడ్, కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు నేమిలె మహేందర్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు దూపటి వెంకటేష్, మండల గౌరవ అధ్యక్షుడు గోపగాని యాదగిరి గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి బత్తిని సత్యనారాయణ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిల్వర్ బాల్‌రాజ్ గౌడ్, బత్తిని బలరాం, వెంకటయ్య, పాండవుల ప్రభాకర్, నరసింహులు, ఆంజనేయులు, దొంకెన పాండు, గుండగోని శ్రీనివాస్, గుడిసెల వెంకటయ్య, గొల్లపల్లి స్వామి, రంగ నరేష్, నీల నాగేష, నమిల పురుషోత్తం పాల్గొన్నారు.

# పెట్రో డీలర్లు బాధ్యతతో మెలగాలి : మాచన రఘునందన్




నల్లగొండ, సెప్టెంబర్ 22 : పెట్రోల్ బంక్ డీలర్లు బాధ్యతతో మెలగాలని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్ అన్నారు. సోమవారం నల్లగొండలోని పెట్రోల్ బంక్‌లను ఆయన తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా మాట్లాడు తూ.. డీలర్లు కొందరు బంక్ నిర్వహణను తేలిగ్గా తీసుకుంటున్నారన్నారు. బంక్ లపై డీలర్ల పర్యవేక్షణ కొరవడితే.. చిన్న, చిన్న విషయాలకు కూడా సమాధానం చెప్పే బాధ్యులు బంక్‌లో ఎవరూ ఉండరన్నారు. డీలర్లు ఎక్కడో ఉండి.. బంక్ ఏదోఒకలా నడుస్తుంది అనుకుంటే పరిస్థితులు ఎప్పుడూ ఒకేలా ఉండవని ఆయన హెచ్చరించారు. చమురు సంస్థల అధికారులతో రఘునందన్ నేరుగా ఫోన్‌లో మాట్లాడి పలు బంకుల్లో నెలకొన్న సమస్యలను వివరించారు. కొన్ని బంకుల్లో మేనేజర్లు మాత్రమే ఉన్నారని, డీలర్లు ఎక్కడో ఉండటం, బంక్ నిర్వహణను ఎవరికో అప్పగించడం వల్ల డీలర్ కాని వ్యక్తులకు వినియోగదారుల పట్ల మర్యాదగా వ్యవహరించగలిగే బాధ్యత అంతగా ఉండదన్నారు.

# హెచ్‌ఎస్‌ఎన్ కోడ్‌ల మ్యాపింగ్ గైడ్‌బుక్‌ను విడుదల చేసిన కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22:భారతలో తయారీ కార్యక్రమం దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పియూష్ గోయల్ ఈ రోజు ఢిల్లీలో పరిశ్రమలు, అంతర్గర వాణిజ్య ప్రోత్సాహక విభాగం (డీపీఐఐటీ) తయారుచేసిన 'హెచ్‌ఎస్‌ఎన్ కోడ్‌ల మ్యాపింగ్ గైడ్‌బుక్'ను విడుదల చేశారు.

ఈ గైడ్‌బుక్ 12,167 హెచ్‌ఎస్ఎన్ సంకేతాలను 31 మంత్రిత్వ శాఖలు, విభాగాలకు కేటాయించింది. లక్ష్యాలను ఆధారంగా చేసుకునే విధాన రూపకల్పనకు వీలు కల్పిస్తుందని, ప్రభావవంతమైన వాణిజ్య చర్చలకు ఇది మద్దతిస్తుందన్న అంచనా ఉంది. ప్రపంచ వాణిజ్య కార్యకలాపాల్లో భారతదేశం పాత్రను బలోపేతం అవుతున్న దృష్ట్యా.. సంబంధిత రంగాల్లోని నిపుణుల మార్గదర్శకత్వంలో ఆయా రంగాలు వృద్ధి సాధించేలా చూసుకునేందుకు ఉత్పత్తులను సంబంధిత విభాగాలతో అనుసంధానించటం అనేది ప్రాధాన్యమైన అంశంగా మారిందని కేంద్ర మంత్రి శ్రీ పియూష్ గోయల్ అన్నారు. ఈ గైడ్‌బుక్.. హెచ్‌ఎస్‌ఎన్ సంకేతాల విషయంలో స్పష్టతను తీసుకొస్తుందని, దీని ఫలితాలను 'భారత్‌లో తయారీ', 'బ్రాండ్ ఇండియాను పెంపొందించటం', 'ప్రపంచం కోసం తయారీ' అనే మార్గదర్శక సూత్రాలకు అనుగుణంగా ఉపయోగించుకునేందుకు ఒక స్పష్టమైన ప్రణాళికను అందిస్తుందని పీయూష్ గోయల్ తెలిపారు. ప్రతి హెచ్‌ఎస్‌ఎన్ సంకేతాన్ని సంబంధిత మంత్రిత్వ శాఖకు అనుసంధానించటం వల్ల ఇది.. ఆయా రంగాలకు సంబంధించిన ప్రక్రియలను అర్థం చేసుకోవటం, వ్యాపార సమన్వయాన్ని సులభతరం చేయటం, వాణిజ్య చర్చలలో భారత్ స్థానాన్ని బలోపేతం చేయటానికి ఉపయోగపడనుంది. హెచ్‌ఎస్‌ఎన్ వ్యవస్థపై అవగాహన వల్ల సామర్థ్యం పెరిగి చట్టపరమైన భారం తగ్గుతుంది.. వికసిత్ భారత్-2047 లక్ష్యానికి దోహదం చేసేలా రవాణా, వాణిజ్య రంగాలను మరింత పోటీపడేలా చేస్తుంది.

# కొలువుదీరిన దుర్గమ్మ.. బాల త్రిపుర సుందరి అవతారంలో అమ్మవారు దర్శనం



ఆదిలాబాద్, సెప్టెంబర్ 22: దుర్గా నవరాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. తాండూరు మండల కేంద్రంతో పాటు మండలంలోని పలుచోట్ల దుర్గాదేవి విగ్రహాలను ప్రతిష్టించి ప్రత్యేక పూజలు చేశారు. తొమ్మిది రోజులపాటు అత్యంత భక్తి శ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాల తొలిరోజు అమ్మవారు బాల త్రిపుర సుందరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

మాదారం టౌన్ షిప్ లోని కోదండ రామాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు అవధూత శర్మ ఆధ్వర్యంలో తొమ్మిది రోజులపాటు అమ్మవారికి దసరా శరన్నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజలు చేయనున్నారు. మొదటి రోజు సూరం రవీందర్ రెడ్డి, తులసి దంపతులు పూజలో పాల్గొన్నారు.

# హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై జన జాగృతి కళావేదిక ఆధ్వర్యంలో అవగాహన

ఆదిలాబాద్, సెప్టెంబర్ 22:తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సంయుక్తంగా జన జాగృతి కళావేదిక ఆధ్వర్యంలో గ్రామస్థులకు హెచ్ఐవీ, ఎయిడ్స్ పై అవగాహన కల్పించారు. మంచిర్యాల జిల్లా డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు తాండూర్ మండల కేంద్రం ఐబీలో సోమవారం కళాకారులు పల్లె సుద్దులు, పాటలు, మాటలతో ప్రజల్ని చైతన్య పరిచారు.

అరక్షితమైన లైంగిక సంబంధాల ద్వారా, కలుషితమైన సూదులు, సిరంజీలు, కలుషితమైన రక్తమార్పిడి ద్వారా, హెచ్ఐవీ సోకిన తల్లి నుంచి బిడ్డకు వస్తుందని వివరించారు. సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని, ఐసీటీసీ కేంద్రానికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీం లీడర్ రాజు, తిరుపతి, కళాకారులు గణేష్, శంకర్, గౌతమ్, హిమశ్రీ, చైల్డ్ వన్ ఇండియా లింక్ వర్కర్స్ రాజేశ్వరి, భాస్కర్, అనిత ఎన్జీవో పార్వతి, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటిగ్రేటెడ్ స్టేట్, సిటీ లాజిస్టిక్స్ ప్రణాళికలను ప్రారంభించిన కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల మంత్రి శ్రీ పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22:మేక్ ఇన్ ఇండియా దశాబ్ద వేడుకల సందర్భంగా కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల మంత్రి శ్రీ పీయూష్ గోయల్ ఈరోజు పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం (డీపీఐఐటీ) రూపొందించిన అనేక పరివర్తనాత్మక కార్యక్రమాలను ప్రారంభించారు. దేశంలో కార్యాచరణ సామర్థ్యాన్ని పెంపొందించడం.. భవిష్యత్తు కోసం సిద్ధంగా ఉన్న, ప్రపంచంతో పోటీపడ గల సమర్థమైన లాజిస్టిక్స్ వ్యవస్థను ఏర్పాటు చేసే లక్ష్యంతో ఈ కార్యక్రమాలను రూపొందించారు.

ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) సహకారంతో ప్రభుత్వం స్మైల్ కార్యక్రమం కింద ఇంటిగ్రేటెడ్ స్టేట్, సిటీ లాజిస్టిక్స్ ప్రణాళికలను ప్రారంభించినట్లు శ్రీ గోయల్ తెలిపారు. ఎనిమిది రాష్ట్రాల్లోని ఎనిమిది నగరాల్లో స్మైల్ కార్యక్రమం ప్రారంభమైందన్నారు. ఈ ప్రక్రియ ఇప్పటికే ఉన్న లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాలను అంచనా వేయడానికి, అంతరాలను గుర్తించడానికి, సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి, ఖర్చులను తగ్గించడం కోసం ఒక ప్రణాళికను అందించడానికి సహాయ పడుతుందని ఆయన వివరించారు. సజావుగా వస్తువులను రవాణా చేయడం, పోటీతత్వాన్ని మెరుగుపరచడం, బలమైన సరఫరా వ్యవస్థ ఏర్పాటు కోసం దేశవ్యాప్తంగా ఇటువంటి ప్రణాళికల్ని అమలు చేసే లక్ష్యంలో ఇది కేవలం ప్రారంభం మాత్రమేనని కేంద్ర మంత్రి తెలిపారు.

డీపీఐఐటీ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలు దేశవ్యాప్తంగా లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాలను ఆధునికీకరించడం, సరఫరా వ్యవస్థలను క్రమబద్ధీకరించడం పట్ల ప్రభుత్వ నిబద్ధతను స్పష్టం చేస్తున్నాయి. ఇంటిగ్రేటెడ్ స్టేట్, సిటీ లాజిస్టిక్స్ ప్రణాళికలను ప్రారంభించడం ఒక కీలక పరిణామం. ఇది స్థానిక లాజిస్టిక్స్ వ్యవస్థలను బలోపేతం చేస్తుంది.. జాతీయ స్థాయిలో పురోగతిని ప్రోత్సహిస్తుంది.

డీపీఐఐటీ ఇప్పటికే నేషనల్ లాజిస్టిక్స్ పాలసీ (ఎన్ఎల్‌పీ), పీఎమ్ గతిశక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్ ద్వారా గణనీయ సంస్కరణలను అమలు చేసింది. లాజిస్టిక్స్ రంగంలో సామర్థ్యం, పోటీతత్వాన్ని మెరుగుపరచడానికి ఒక బలమైన ప్రాథమిక ప్రణాళికను ఇది అందిస్తుంది. మల్టీమోడల్, ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ వ్యవస్థల బలోపేత కార్యక్రమం (స్మైల్) కింద ఏడీబీ ఈ ప్రయత్నాలకు మరింత మద్దతునిస్తుంది.

రాష్ట్రాలు కూడా తమ సొంత లాజిస్టిక్స్ విధానాలు, కార్యాచరణ ప్రణాళికలను రూపొందించుకోవడం ద్వారా ఎన్ఎల్‌పీ లక్ష్యాలకు అనుగుణంగా చురుకైన చర్యలు తీసుకున్నాయి. పీఎమ్ గతిశక్తి కార్యక్రమం, ఎన్ఎల్‌పీ, డిసెంబర్ 2024లో జరిగిన నాలుగో ప్రధాన కార్యదర్శుల సమావేశం సందర్భంగా జారీ చేసిన ఆదేశాలకు అనుగుణంగా.. డీపీఐఐటీ ఇప్పుడు సిటీ లాజిస్టిక్స్ ప్రణాళికలను సిద్ధం చేయడంలో రాష్ట్రాలకు మద్దతునిచ్చేందుకు ఒక ప్రణాళికాబద్ధమైన విధానాన్ని అనుసరిస్తోంది.

ఆధునికమైన, సమగ్రమైన, ప్రపంచంతో పోటీపడగల లాజిస్టిక్స్ రంగాన్ని నిర్మించే దిశగా పురోగమిస్తున్న భారత్ ప్రయాణంలో ఈ కార్యక్రమాలు ఒక కీలక ముందడుగును సూచిస్తాయి.

# జగన్మాతను అర్చిస్తే ఆధ్యాత్మిక జ్ఞానం సిద్ధిస్తుంది : శ్రీ మధుసూదనానంద స్వామిజీ



మెదక్, సెప్టెంబర్ 22: నవరాత్ర మహోత్సవ పర్వదినాల్లో జగన్మాత ప్రతిరూపాలైన శ్రీ సరస్వతి, శ్రీ దుర్గాదేవి, శ్రీ లక్ష్మీదేవిలను భక్తి శ్రద్ధలతో అర్చిస్తే ఆధ్యాత్మిక జ్ఞానం సిద్ధిస్తుందని శ్రీ క్షేత్రం పీఠాధిపతి శ్రీ మధు సూదనానంద సరస్వతి స్వామిజీ పేర్కొన్నారు.

ప్రసిద్ధ వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్రంలో నవరాత్ర మహోత్సవ అంకురార్పణ కార్యక్రమంలో పాల్గొన్న స్వామిజీ భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. బాల త్రిపుర సుందరీ దేవి అవతారంలో శ్రీ విద్యాధరి అమ్మవారు భక్తులకు దర్శన భాగ్యం కల్పించగా, స్వామిజీ క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ఆశీస్సులు అందజేశారు.

క్షేత్ర వ్యవస్థాపకుడు బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి ఆధ్యాత్మిక ప్రయాణంలో గొప్ప గొప్ప పనులకు శ్రీకారం చుట్టగా.. ప్రస్తుతం ఆ పరిమళాలు ప్రతి ఒక్కరిలో దైవ చింతన పెంపొందిస్తున్నట్లు స్పష్టం చేశారు. ముఖ్యంగా నవరాత్ర మహోత్సవ పర్వదినాలు ఆధ్యాత్మిక సాధకులకే కాకుండా లౌకిక జీవితాన్ని గడిపే ప్రతి ఒక్కరికి చక్కటి సందేశం ఇస్తుందని అన్నారు.

అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని ప్రసాదించమని శ్రీ సరస్వతి మాత, శాంతి, శ్రేయస్సు కోసం శ్రీ లక్ష్మీ దేవిని ప్రార్థించాలని, అడ్డంకులు తొలగడానికి శ్రీ దుర్గామాతను సేవించాలని ఆకాంక్షించారు. శుభప్రదమైన ఈ పర్వదినాల్లో పుణ్య స్థలాలు దర్శించి దేవి దేవతలను అర్చించాలని, తద్వారా ఆధ్యాత్మిక భావన, మానసిక ప్రశాంతత దక్కుతుందని స్పష్టం చేశారు.

### అమ్మవారికి ప్రత్యేక పూజలు..

కాగా మొదటగా క్షేత్రంలో ఆలయ వ్యవస్థాపక ఛైర్మన్ శ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో ఆస్థాన వేద పండితులు బాల ఉమామహేశ్వర శర్మ పరివారనీ అమ్మవారికి విశేష పంచామృతాభిషేకం, శ్రీ గణపతి పూజ, కలశ స్థాపన, అంకురార్పణ, చండీ హోమం, ప్రత్యేక పూజలు తదితర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రానికి విశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలతోపాటు మహా ప్రసాదం అందజేశారు.

# సీఎం ఇంటి ముట్టడికి వెళ్లకుండా లంబాడి నాయకుల ముందస్తు అరెస్టు

కరీంనగర్, సెప్టెంబర్ 22: ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించే కుట్రను నిరసిస్తూ హైదరాబాదులో సీఎం రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడించే కార్యక్రమానికి తరలి వెళ్లకుండా పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని లంబాడి తండా కొత్తూరు గ్రామానికి చెందిన పలువురు లంబాడి నాయకులను ధర్మారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అనంతరం వారిని వ్యక్తిగత పూచికత్తు కింద విడుదల చేశారు. ఎస్టీ జాబితా నుంచి లంబాడి సామాజిక వర్గాన్ని తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తున్న నేపథ్యంలో సోమవారం హైదరాబాద్ లో సీఎం రేవంత్ రెడ్డి ఇంటిని లంబాడీలు ముట్టడించాలని లంబాడి హక్కుల ఐక్యవేదిక నాయకులు పిలుపునిచ్చారు.

ఈ క్రమంలో ధర్మారం మండలం నుంచి లంబాడీలు హైదరాబాద్ తరలి వెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్టు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో లంబాడి తండా గ్రామానికి చెందిన అజ్మీర మల్లేశం నాయక్, అజ్మీర తిరుపతి నాయక్, భూక్యా రాజు నాయక్, వాంకుడోత్ నరేష్ నాయక్, కొత్తూరు భూక్యా రాజేశం నాయక్ ,బానోత్ రాజేష్ నాయక్, భూక్యా శ్రీనివాస్ నాయక్, గుగులోత్ అంజి నాయక్, లాల్ సింగ్ నాయక్ తదితరులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. అనంతరం సాయంత్రం వ్యక్తిగత పూచికత్తు కింద వారిని పోలీసులు విడుదల చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం ఎస్టీ జాబితాలో ఉన్న లంబాడి సామాజిక వర్గాన్ని ఆ జాబితా నుంచి తొలగించాలని రాష్ట్రప్రభుత్వం కుట్ర చేయడం సరైనది కాదని అన్నారు. ఇప్పటికీ తమ సామాజిక వర్గం ఎంతో వెనుకబడి ఉందని వారన్నారు. కానీ నేడు ప్రభుత్వం అకారణంగా ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలని కుట్ర చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. లంబాడీలపై కుట్ర మానుకోకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని వారు పేర్కొన్నారు.

# ప్రత్యేక జీఎస్టీ ఉప కేటగిరీ కింద వినియోగదారులకు మరింత సాధికారత కల్పిస్తున్న జాతీయ హెల్ప్‌లైన్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22:కేంద్ర ఆర్థికమంత్రి అధ్యక్షతన జీఎస్టీ కౌన్సిల్ 56వ సమావేశంలో ఆమోదించిన తదుపరి తరం జీఎస్టీ సంస్కరణలు 2025 తో జాతీయ వినియోగదారుల హెల్ప్ లైన్ (ఎన్సీహెచ్) ను అనుసంధానించేందుకు వినియోగదారుల వ్యవహారాల శాఖ చర్యలు తీసుకుంది. ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధానమంత్రి వ్యక్తీకరించిన దార్శనికతకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నారు.

22.09.2025 నుంచి అమలులోకి వచ్చే సవరించిన జీఎస్టీ ఛార్జీలు, రేట్లు, మినహాయింపులను అమలు చేసిన తరువాత వినియోగదారుల నుంచి వచ్చే అవకాశం ఉన్న ప్రశ్నలు, ఫిర్యాదులను పరిష్కరించడానికి, ఐఎన్జీఆర్ఏఎం పోర్టల్లో ప్రత్యేక కేటగిరీని అందుబాటులోకి తెచ్చారు. ఈ కేటగిరీలో ఆటోమొబైల్స్, బ్యాంకింగ్, దీర్ఘకాల వినియోగ వస్తువులు, ఇ-కామర్స్, ఎఫ్ఎంసీజీ వంటి ప్రధాన ఉప కేటగిరీలు ఉన్నాయి. వీటిలో జీఎస్టీ సంబంధిత ఫిర్యాదులను నమోదు చేస్తారు.

ఈ ఏర్పాటుకు సన్నాహకంగా, జీఎస్టీ సంబంధిత ప్రశ్నలు, ఫిర్యాదులను సమర్థవంతంగా పరిష్కరించేలా ఎన్సీహెచ్ కౌన్సెలర్లను సన్నద్ధం చేయడానికి కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డ్ (సీబీఐసీ) అధికారులు 11.09.2025న మొదటి శిక్షణా తరగతిని నిర్వహించారు. ప్రముఖ ఇ-కామర్స్ వేదికలు, పరిశ్రమ సంఘాల ప్రతినిధులు, దీర్ఘకాల వినియోగ వస్తువుల తయారీ కన్స్యూమర్ కంపెనీల భాగస్వామ్యంతో 17.09.2025న వినియోగదారుల వ్యవహారాలశాఖ కార్యదర్శి అధ్యక్షతన భాగస్వాముల సలహా సంప్రదింపుల సమావేశం కూడా జరిగింది. నిర్దిష్ట వస్తువులు, సేవలపై జీఎస్టీ రేటు తగ్గింపుల ప్రయోజనాలను వినియోగదారులకు అందించాలని సమావేశంలో పాల్గొన్నవారిని కోరారు.

ఈ విభాగంలో వినియోగారుల ఫిర్యాదుల ఆధారంగా సేకరించిన సమాచారాన్ని, విశ్లేషణలను సంబంధిత కంపెనీలు, సీబీఐసీ, ఇతర సంబంధిత అధికారులతో హెల్ప్‌లైన్ పంచుకుంటుంది. తద్వారా సంబంధిత చట్టాల ప్రకారం తక్షణ చర్యలు తీసుకునే వీలుంటుంది. ఈ చర్య జీఎస్టీ కట్టుబాటును బలోపేతం చేస్తుందని, సహేతుకమైన మార్కెట్ పద్ధతులలో వినియోగదారులు చురుకైన వాటాదారులుగా మారేలా భాగస్వామ్య పాలనా నమూనాను ప్రోత్సహిస్తుందని భావిస్తున్నారు.

దేశవ్యాప్తంగా వినియోగదారులు తమ ఫిర్యాదులను న్యాయ ప్రక్రియకు ముందున్న దశలో నమోదు చేసుకునే ఏకైక వేదికగా ఆవిర్భవించింది. వినియోగదారులు ఇప్పుడు 17 భాషల్లో (హిందీ, ఇంగ్లీష్, కాశ్మీరి, పంజాబీ, నేపాలి, గుజరాతీ, మరాఠీ, కన్నడ, తెలుగు, తమిళం, మలయాళం, మైథిలీ, సంతాలి, బెంగాలీ, ఒడియా, అస్సామీ, మణిపురి) తమ ఫిర్యాదులను టోల్-ఫ్రీ నంబర్ 1915 ద్వారా లేదా ఇంటిగ్రేటెడ్ గ్రీవెన్స్ రెడ్రెసల్ మెకానిజం (ఐఎన్జీఆర్ఏఎం) ద్వారా నమోదు చేసుకోవచ్చు.

ఈ ఐటీ ఆధారిత ఓమ్ని-చానల్ వేదిక వినియోగదారులకు సౌలభ్యాన్ని, సానుకూలతను అందిస్తూ, వాట్సాప్, ఎస్ఎంఎస్, ఇమెయిల్, ఎన్సీహెచ్ యాప్, వెబ్ పోర్టల్, ఉమాంగ్ యాప్ వంటి అనేక రకాల రిజిస్ట్రేషన్ విధానాలకు మద్దతు ఇస్తుంది.

ఎన్సీహెచ్ క్రమంగా ప్రైవేట్ కంపెనీలు, రెగ్యులేటర్లు, అంబుడ్స్‌మన్, ప్రభుత్వ ఏజెన్సీలతో కూడిన 1,142 భాగస్వాములతో కలిసి బలమైన వ్యవస్థగా అభివృద్ధి చెందింది.

తద్వారా కేంద్రీకృత, వేగవంతమైన ఫిర్యాదుల పరిష్కారాన్ని సాధ్యమయ్యేలా చేసింది. ప్రతి ఫిర్యాదుకూ పారదర్శకంగా ట్రాకింగ్, పరిష్కారం కోసం ప్రత్యేకమైన డాకెట్ నంబర్ కేటాయిస్తారు. ప్రస్తుతం ఈ వేదికకు నెలకు లక్షకు పైగా ఫిర్యాదులు వస్తున్నాయి. ఇది వినియోగదారుల పెరుగుతున్న నమ్మకాన్ని ప్రతిబింబిస్తుంది.

ఎన్సీహెచ్ లో చేసిన సాంకేతిక మార్పు దాని కాల్-హ్యాండ్లింగ్ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచింది. 2015 డిసెంబర్‌లో 12,553 కాల్స్ మాత్రమే స్వీకరించిన ఎన్సీహెచ్ 2024 డిసెంబర్ నాటికి 1,55,138 కాల్స్ అందుకుని పది రెట్లుపైగా వృద్ధి సాధించింది. ఇంతటి పెరుగుదల, హెల్ప్‌లైన్‌పై వినియోగదారులకు పెరుగుతున్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుంది. అదేవిధంగా, ప్రతి నెలా నమోదయ్యే సగటు ఫిర్యాదుల సంఖ్య 2017లో 37,062 నుంచి 2025 నాటికి 1,70,585కి పెరిగింది. డిజిటల్ విధానాలను ప్రవేశపెట్టడంతో, హెల్ప్‌లైన్‌లోని దాదాపు 65% వినియోగదారుల ఫిర్యాదులు ఆన్‌లైన్ డిజిటల్ ఛానెళ్ల ద్వారా నమోదు అయ్యాయి.

# అరుణాచల్ ప్రదేశ్ లోని అపారమైన జలవిద్యుత్తు సామర్థ్యాన్ని వినియోగించుకునేలా ఇటానగర్ లో రూ. 3,700 కోట్ల పైగా విలువైన రెండు భారీ జల విద్యుత్తు ప్రాజెక్టులకు శంకుస్థాపన

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సెప్టెంబర్ 22వ తేదీన అరుణాచల్ ప్రదేశ్ , త్రిపుర రాష్ట్రాల్లో పర్యటిస్తారు. అరుణాచల్ ప్రదేశ్ లోని ఇటానగర్ లో 5,100 కోట్ల రూపాయల పైగా విలువైన అనేక అభివృద్ధి పథకాలకు ఆయన శంకుస్థాపన చేస్తారు. బహిరంగసభలో ప్రసంగిస్తారు.

ఆ తరువాత, ఆయన త్రిపురలో మాతా త్రిపుర సుందరి ఆలయాన్ని దర్శించి పూజాకార్యక్రమాలలో పాల్గొంటారు. మాతా త్రిపుర సుందరి ఆలయ సముదాయం' అభివృద్ధి పనులను ప్రారంభిస్తారు.

అరుణాచల్ ప్రదేశ్ ప్రాంతంలో విస్తారమైన జలవిద్యుత్ సామర్థ్యాన్ని వినియోగించుకుంటూ సుస్థిరమైన ఇంధన ఉత్పత్తిని ప్రోత్సహించడం కోసం ఇటానగర్‌లో రూ. 3,700 కోట్లకు పైగా విలువైన రెండు భారీ జలవిద్యుత్ ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేస్తారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని సియోం ఉప పరివాహక ప్రాంతంలో హియో హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్ (240 మెగావాట్లు), టాటో-ఎ హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్ (186 మెగావాట్లు) లను అభివృద్ధి చేస్తారు.

తావాంగ్‌లో అత్యాధునిక కన్వెన్షన్ సెంటర్‌కు ప్రధాని శంకుస్థాపన చేస్తారు. సముద్ర మట్టానికి 9,820 అడుగుల ఎత్తులో ఉన్న సరిహద్దు జిల్లా తావాంగ్‌లో నిర్మించే ఈ కన్వెన్షన్ సెంటర్ జాతీయ, అంతరాజతీయ సమావేశాలు, సాంస్కృతిక ఉత్సవాలు, ప్రదర్శనలను నిర్వహించ డానికి ఒక ఒక ప్రతిష్ఠాత్మక వేదికగా నిలుస్తుంది. 1,500 మందికి పైగా ప్రతినిధులకు ఆతిథ్యం ఇవ్వగల సామర్థ్యంతో ఈ కేంద్రం అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ ప్రాంత పర్యాటక, సాంస్కృతిక సామర్థ్యాలను మరింత అభివృద్ధి చేయడానికి తోడ్పడుతుంది.

రూ.1,290 కోట్లకు పైగా విలువైన పలు కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులను కూడా ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. వీటిలో రవాణా అనుసంధానం, ఆరోగ్యం, అగ్నిమాపక భద్రత, ఉద్యోగినుల వసతి గృహాలు మొదలైనవి ఉన్నాయి. ఇవి ఈ ప్రాంతంలో ఆర్థిక కార్యకలాపాలను వేగవంతం చేసి, జీవన ప్రమాణాలను మెరుగుపరచి, అనుసంధానాన్ని మరింత బలోపేతం చేస్తాయని భావిస్తున్నారు.

వ్యాపార సౌలభ్యం కల్పించి, ప్రోత్సాహకరమైన పారిశ్రామిక వాతావరణాన్ని అభివృద్ధి చేయాలన్న తమ ఉద్దేశానికి అనుగుణంగా, ప్రధానమంత్రి స్థానిక పన్ను చెల్లింపుదారులు, వ్యాపారులు, పరిశ్రమ ప్రతినిధులతో సమావేశమై, ఇటీవలి జీఎస్టీ రేట్ల సవరణ ప్రభావంపై కూడా చర్చించనున్నారు.

దేశంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వాన్ని అభివృద్ధి చేసి, సంరక్షించాలన్న నిబద్ధతకు అనుగుణంగా, పునరుజ్జీవనం, ఆధ్యాత్మిక వారసత్వ అభివృద్ధి (ప్రసాద్) పథకం కింద మాతబరిలోని మాత త్రిపురసుందరి దేవాలయ సముదాయం అభివృద్ధి పనులను ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. పురాతన 51 శక్తి పీఠాలలో ఒకటైన . ఈ ఆలయం త్రిపుర రాష్ట్రంలోని గోమతి జిల్లా ఉదయపూర్ పట్టణంలో ఉంది.

ఈ ప్రాజెక్టు పైనుంచి చూడగానే తాబేలు ఆకారంలో కనిపించేలా రూపుదిద్దుకోనుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా ఆలయ ప్రాంగణంలో మార్పులుచేస్తారు. కొత్త దారులు నిర్మిస్తారు. ప్రవేశ ద్వారాలను పునరుద్ధరిస్తారు. ప్రహరీ, డ్రైనేజ్ వ్యవస్థ, స్టాళ్లు, ధ్యాన మందిరం, అతిథుల వసతి గృహాలు, కార్యాలయ గదులు మొదలైన వాటితో కూడిన కొత్త మూడు అంతస్తుల సముదాయాన్ని నిర్మిస్తారు. ఈ ప్రాంతంలో పర్యాటకాన్ని ప్రోత్సహించడానికి, ఉద్యోగాలను, వ్యాపార అవకాశాలను సృష్టించడానికి, సమగ్ర సామాజిక- ఆర్థిక అభివృద్ధికి ఈ ప్రాజెక్ట్ కీలక పాత్ర పోషిస్తుంది.

# పెండింగ్ జీతాలు విడుదల చేయాలని కొనసాగుతున్న నిరవధిక సమ్మె

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 22: ఏడు నెలల పెండింగ్ జీతాలు వెంటనే విడుదల చేయాలనిపట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో డైలీ వేజ్ వర్కర్లు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె 11వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా అంబేద్కర్ చౌరస్తాలో బతుకమ్మఆడుతూ నిరసన తెలిపారు.

ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శంకర్ నాయక్ మాట్లాడుతూ కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్‌లో పనిచేసే ఉద్యోగులకు సంవత్సరాల తరబడి జీతాలు వేయకపోతే కుటుంబాలు ఎలా గడుస్తాయని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ మంత్రి, జేఏసీ నాయకులతో చర్చించి సమస్య పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.డైలీ వేజ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డైలీ వేజ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సురేందర్, నాయకులు భరత్, జిల్లా అధ్యక్షులు పర్వతాలు, అంజమ్మ, పద్మ, బాలుమణి, చిట్టెమ్మ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాలకతీతంగా ఉద్యమిద్దాం

## - పులి దేవేందర్ ముదిరాజ్

వరంగల్, సెప్టెంబర్ 22: రాష్ట్రంలోని ముదిరాజులు రాజకీయాలకతీతంగా ఉద్యమిస్తేనే రిజర్వేషన్, హక్కుల సాధన సాధ్యమని మెపా మెపా (ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ తెలంగాణ ) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ అన్నారు. తెలంగాణ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్‌తో సోమవారం ఆయన నివాసం హనుమకొండ హంటర్‌రోడ్డులో రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులతో కలిసి సమావేశమయ్యారు.



ముదిరాజ్ బిడ్డలు ఏ రాజకీయ పార్టీలో ఉన్నా జాతి అభివృద్ధి కోసం కృషి చేయాలని దేవేందర్ అన్నారు. డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా చేస్తున్న కార్యక్రమాలు బాగున్నాయని ఈ సందర్భంగా అభినందించారు. ముదిరాజులు ఏ పార్టీలో ఉన్నా క్యాడర్ల కాకుండా లీడర్‌గా ఎదగాలని అభిప్రాయపడ్డారు. అనంతరం మెపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం రాజు ముదిరాజ్, రాష్ట్ర సలహాదారులు పులి ప్రభాకర్ ముదిరాజ్ మాట్లాడుతూ వెనుకబడిన ముదిరాజ్ బిడ్డలకు మెపా ఎల్లప్పుడు సహకారం అందిస్తుందనీ,ప్రతి ముదిరాజ్ బిడ్డ మెపాలో భాగస్వామ్యం కావడానికి ముందుకు వస్తున్నారన్నారు.కార్యక్రమంలో ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్?అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి నీరటి రాజు ముదిరాజ్, మెపా గౌరవ సలహాదారులు పులి ప్రభాకర్ ముదిరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పొన్నం రాజు ముదిరాజ్, హనుమకొండ జిల్లా అధ్యక్షులు పులి రాజేష్, ఉపాధ్యక్షులు గోనెల విజేందర్, హనుమకొండ జిల్లా యువజన విభాగం అధ్యక్షులు గోనెల సాగర్,పులి మహేష్ ముదిరాజ్ ,బోడ రంజిత్ ముదిరాజ్, కొక్కు రమేశ్ ముదిరాజ్, బొల్లి భాస్కర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

# ఆయన వారసత్వం భారత సృజనాత్మక రంగానికి స్ఫూర్తినిస్తూనే ఉంటుంది: శ్రీ అశ్వినీ వైష్ణవ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22:దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారాల ఎంపిక కమిటీ సిఫార్సు మేరకు 2023 సంవత్సరానికి ప్రతిష్మాత్మక దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారాన్ని శ్రీ మోహన్‌లాల్‌కు ప్రదానం చేస్తున్నట్లు భారత ప్రభుత్వం ఈ రోజు ప్రకటించింది. దిగ్గజ నటుడుగా, దర్శకుడుగా, నిర్మాతగా భారతీయ సినిమాకు చేసిన సేవలకు గాను ఆయనకు ఈ పురస్కారాన్ని ప్రకటించారు. ఈ నెల 23న నిర్వహించే 71వ జాతీయ చలనచిత్ర పురస్కారాల ప్రదానోత్సవంలో ఆయనకు ఈ పురస్కారాన్ని అందిస్తారు.

భారతీయ సినిమాకు మోహన్‌లాల్ చేసిన అసాధారణ కృషికి గుర్తింపుగా ఆయనకు ఈ పురస్కారాన్ని ప్రకటించడం పట్ల కేంద్ర సమాచార-ప్రసార, రైల్వేలు, ఎలక్ట్రానిక్స్-సమాచార సాంకేతిక శాఖల మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ హర్షం వ్యక్తం చేశారు.

మోహన్‌లాల్ అద్భుత సినీ ప్రయాణం తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటుంది. ఆయన అసమాన ప్రతిభ, బహుముఖ ప్రజ్ఞ, అవిశ్రాంత కృషి భారతీయ చలనచిత్ర చరిత్రలో ఒక సువర్ణాధ్యాయం.

శ్రీ మోహన్‌లాల్ విశ్వనాథన్ నాయర్.. కేరళలో 1960, మే 21వ తేదీన జన్మించారు. నటుడుగా, నిర్మాతగా, నేపథ్య గాయకుడుగా- మలయాళ సినిమాల్లో పేరు తెచ్చుకున్నారు. పరిపూర్ణమైన నటుడుగా ఆయన్ను అభివర్ణిస్తారు. దాదాపు అయిదు దశాబ్దాల తన కెరీర్‌లో 360కి పైగా చిత్రాల్లో నటించారు. కిరీడం, భారతం, వానప్రస్థం, దృశ్యం వంటి అనేక చిత్రాల్లో తన అద్భుతమైన నటనతో అందరినీ ఆకట్టుకున్నారు.

మోహన్‌లాల్ అయిదు జాతీయ చలనచిత్ర పురస్కారాలు, పలుసార్లు కేరళ రాష్ట్ర చలనచిత్ర పురస్కారాలనూ అందుకున్నారు. దేశవిదేశాల్లో అనేక గౌరవాలతో పాటు కేన్స్ చలనచిత్రోత్సవంలో శ్రీ మోహన్ లాల్ నటించిన "వానప్రస్థం" (1991) చిత్రాన్ని ప్రదర్శించారు. ఇది ఆయనకు అంతర్జాతీయ గుర్తింపును తెచ్చిపెట్టింది.

సినిమా రంగం కాకుండా.. ఆయన 2009లో ఇండియన్ టెరిటోరియల్ ఆర్మీలో గౌరవ లెఫ్టినెంట్ కల్నల్‌గా నియమితులయ్యారు. ఆయనను భారత ప్రభుత్వం 2001లో పద్మశ్రీ,



2019లో పద్మభూషణ్ పురస్కారంతో సత్కరించింది. బహుముఖ ప్రజ్ఞ, వినయంతోపాటు ప్రపంచ సినిమా కోసం చేసిన నిరంతర కృషితో మోహన్‌లాల్.. భారత సాంస్కృతిక గౌరవానికి ప్రతీకగా నిలిచే ప్రముఖుల్లో ఒకరిగా స్థానం సంపాదించుకున్నారు.

# కొత్త జీఎస్టీ విధానంతో ప్రతి పౌరుడికీ చేరనున్న ప్రయోజనాలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు వీడియో అనుసంధానం ద్వారా జాతినుద్దేశించి ప్రసంగించారు. శక్తిని పూజించే పండుగ నవరాత్రి ప్రారంభం సందర్భంగా పౌరులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. నవరాత్రి మొదటి రోజు నుంచే దేశం ఆత్మనిర్భర్ భారత్ ప్రచారంలో కీలక ముందడుగు వేస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. సెప్టెంబర్ 22న సూర్యోదయం నుంచే దేశంలో తదుపరి తరం జీఎస్టీ సంస్కరణలు అమలవుతాయన్నారు. ఇది భారత్ అంతటా జీఎస్టీ బచత్ ఉత్సవ ప్రారంభాన్ని సూచిస్తుందని ప్రధానమంత్రి అన్నారు. ఈ పండుగ పొదుపును పెంచుతుందనీ.. ప్రజలు తమకు నచ్చిన వస్తువులను కొనుగోలు చేయడాన్ని సులభతరం చేస్తుందనీ ఆయన స్పష్టం చేశారు. ఈ పొదుపు పండుగ ప్రయోజనాలు పేదలు, మధ్యతరగతి, నవ మధ్యతరగతి, యువత, రైతులు, మహిళలు, దుకాణదారులు, వ్యాపారులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సమానంగా చేరుతాయని శ్రీ మోదీ పేర్కొన్నారు. ఈ పండుగ సీజన్‌లో ప్రతి కుటుంబం రెట్టింపు ఆనందాన్ని, మాధుర్యాన్ని పొందుతుందని ఆయన వ్యాఖ్యానించారు. తదుపరి తరం జీఎస్టీ సంస్కరణలు, జీఎస్టీ పొదుపు పండుగ కోసం దేశంలోని కోట్లాది కుటుంబాలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంస్కరణలు దేశ వృద్ధిని వేగవంతం చేస్తాయని.. వ్యాపార కార్యకలాపాలనూ సులభతరం చేస్తాయని.. మరిన్ని పెట్టుబడులను ఆకర్షిస్తాయని ప్రధానమంత్రి వివరించారు. అభివృద్ధి పోటీలో ప్రతి రాష్ట్రం సమాన భాగస్వామిగా మారుతుందనీ ఆయన ఆకాంక్షించారు.

2017లో భారత్ జీఎస్టీ సంస్కరణల దిశగా తొలి అడుగులు వేయడం ద్వారా పాత అధ్యాయానికి ముగింపు పలికి.. దేశ ఆర్థిక చరిత్రలో సరికొత్త అధ్యాయానికి నాంది పలికిందని గుర్తుచేశారు. దశాబ్దాలుగా పౌరులు, వ్యాపారులు ఆక్ట్రోయ్, ప్రవేశ పన్ను, సేల్స్ టాక్స్, ఎక్సైజ్, వ్యాట్, సేవా పన్నుల వంటి సంక్లిష్టమైన పన్నుల వలయంలో చిక్కుకుని ఇబ్బందులు ఎదుర్కొన్నారని శ్రీ మోదీ పేర్కొన్నారు. ఒక నగరం నుంచి మరో నగరానికి వస్తువులను రవాణా చేయడానికి అనేక చెక్‌పోస్టులను దాటడం.. అనేక ఫారమ్‌లను పూరించడం.. ప్రతి చోటా వివిధ రకాల పన్నుల నిబంధనలను ఎదుర్కోవడం వంటి కష్టాలు ఉండేవన్నారు. 2014లో ప్రధానమంత్రిగా తాను బాధ్యతలు స్వీకరించిన సమయంలో ఒక విదేశీ వార్తాపత్రికలో వచ్చిన వ్యాసాన్ని ఉటంకిస్తూ తన వ్యక్తిగత జ్ఞాపకాలను పంచుకున్నారు. బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వస్తువులను పంపడం చాలా కష్టంగా భావించిన ఒక కంపెనీ ఎదుర్కొన్న సవాళ్లను ఆ వ్యాసంలో చక్కగా వివరించారన్నారు. కేవలం 570 కిలోమీటర్ల దూరం సరుకులను పంపడం కష్టమై ఆ సంస్థ ఏకంగా బెంగళూరు నుంచి సరుకులను యూరప్‌కు పంపి.. ఆపై వాటిని తిరిగి హైదరాబాద్‌కు రవాణా చేసుకునేందుకు మొగ్గుచూపడం గురించి ఆ వ్యాసం చక్కగా వివరించిందని తెలిపారు.

పన్నులు, టోల్ ఇబ్బందుల కారణంగా ఆ రోజుల్లో పరిస్థితులు దిగజారిపోయినట్లు ప్రధానమంత్రి తెలిపారు. అలాంటి లెక్కలేనన్ని సందర్భాల్లో ఇప్పుడు చెప్పిన ఉదాహరణ ఒకటని ఆయన పునరుద్ఘాటించారు. బహుళ పన్నుల సంక్లిష్ట వలయం కారణంగా లక్షలాది కంపెనీలు, కోట్లాది పౌరులు ప్రతిరోజూ ఇబ్బందులు పడేవారన్నారు. ఒక నగరం నుంచి మరొక నగరానికి వస్తువులను రవాణా చేయడంలో పెరిగిన ఖర్చును చివరికి పేదలే భరించాల్సి వచ్చేదనీ.. ఎందుకంటే వినియోగదారుల నుంచే వారు ఆ మొత్తాన్ని తిరిగి పొందేవారని శ్రీ మోదీ తెలిపారు.

దేశాన్ని పన్ను సంక్లిష్టతల నుంచి విముక్తి చేయాలనే సంకల్పంతో 2014లో తమ ప్రభుత్వం ప్రజల, దేశ ప్రయోజనాల కోసం జీఎస్టీకి ప్రాధాన్యమిచ్చిందని శ్రీ మోదీ గుర్తు చేశారు. ఆయా రంగాలకు సంబంధించిన వ్యక్తులతో విస్తృతమైన సంప్రదింపులు నిర్వహించడంతో పాటు రాష్ట్రాలు లేవనెత్తిన ప్రతి ఆందోళనను పరిష్కరించామని ప్రధానమంత్రి తెలిపారు. అన్ని రాష్ట్రాల ఐక్యతతోనే స్వతంత్ర భారతంలో ఇంతటి గొప్ప పన్ను సంస్కరణ సాధ్యమైందన్నారు. కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల సమష్టి కృషి ఫలితంగా దేశం బహుళ పన్నుల ఇబ్బందుల నుంచి విముక్తి పొందిందని తెలిపారు. దేశవ్యాప్తంగా ఏకరీతి వ్యవస్థను ఏర్పాటు చేశామని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఒకే దేశం–ఒకే పన్ను కల సాకారమైందని ఆయన ధ్రువీకరించారు.

సంస్కరణలను నిరంతర ప్రక్రియగా పేర్కొన్న ప్రధానమంత్రి.. కాలం మారుతున్న కొద్దీ.. జాతీయ అవసరాలు అభివృద్ధి చెందుతున్న కొద్దీ.. తదుపరి తరం సంస్కరణలు కూడా అంతే కీలకం అవుతాయన్నారు. దేశ ప్రస్తుత అవసరాలు, భవిష్యత్తు ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకుని ఈ కొత్త జీఎస్టీ సంస్కరణలు అమలు చేస్తున్నామని ప్రధానమంత్రి వెల్లడించారు. కొత్త విధానంలో ప్రధానంగా 5 శాతం, 18 శాతం పన్ను స్లాబులు మాత్రమే ఉంటాయని శ్రీ మోదీ స్పష్టం చేశారు. అంటే రోజువారీ ఉపయోగించే అనేక వస్తువులు మరింత సరసమైనవిగా మారుతాయన్నారు. ఆహార పదార్థాలు, మందులు, సబ్బులు, టూత్‌బ్రష్‌లు, టూత్‌పేస్ట్, ఆరోగ్య, జీవిత బీమా వంటి అనేక వస్తువులు, సేవలు పన్ను లేకుండా లేదా 5 శాతం పన్ను జాబితాలో ఉన్నాయన్నారు. గతంలో 12 శాతం పన్ను విధించిన వస్తువుల్లో దాదాపుగా 99 శాతం వస్తువులను ఇప్పుడు 5 శాతం పన్ను పరిధిలోకి తెచ్చామని ప్రధానమంత్రి తెలిపారు.

గత పదకొండు సంవత్సరాల్లో, 25 కోట్ల మంది భారతీయులు పేదరికం నుంచి బయటపడి ఒక ముఖ్య మధ్యతరగతి వర్గంగా ఎదిగారనీ, వీరు దేశ ప్రగతిలో కీలక పాత్రను పోషిస్తున్నారనీ ప్రధానమంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ మధ్యతరగతి ప్రజలకు వారివంటూ ఆకాంక్షలూ, కలలూ ఉన్నాయని ఆయన అన్నారు. ఈ సంవత్సరం ప్రభుత్వం రూ.12 లక్షల వరకు ఆదాయంపై పన్ను మినహాయింపును కానుకగా ప్రకటించి, మధ్యతరగతి ప్రజల జీవనంలో ఎంతో సౌలభ్యంతో పాటు అనుకూలతను కూడా అందించిందన్నారు. ఇప్పుడు ప్రయోజనాలను పొందాల్సిన వంతు పేదలదీ, మధ్య తరగతి ప్రజలదీ అని ఆయన అన్నారు. వారు .. మొదట ఆదాయపు పన్నులో ఉపశమనాన్నీ, ఇప్పుడు జీఎస్టీలో తగ్గింపునూ.. ఇలా రెండు విధాలుగానూ లాభాన్ని అందుకొంటున్నారని ఆయన వివరించారు. జీఎస్టీ రేట్లను తగ్గించడంతో, దేశ పౌరులు వారి వ్యక్తిగత కలలను నెరవేర్చుకోవడం సులభతరమవుతుందన్నారు. ఇంటిని నిర్మించుకోవడం కావచ్చు, ఒక టీవీని గాని లేదా రిఫ్రిజిరేటరును గాని , లేదా ఒక స్కూటరునో, మోటర్‌సైకిల్‌నో, లేదా కారునో కొనడం కావచ్చు.. ఇక అన్నీ చౌకగా లభిస్తాయని ఆయన తెలిపారు. ప్రయాణం చేయాలన్నా, అందుకు కూడా తక్కువ ఖర్చే అవుతుందనీ, దీనికి కారణం చాలా వరకు హోటల్ గదులపై జీఎస్టీని తగ్గించడమేననీ ఆయన చెప్పారు. జీఎస్టీ సంస్కరణల విషయంలో దుకాణదారుల ఉత్సాహభరిత స్పందన చూసి తాను సంతోషిస్తున్నానని శ్రీ మోదీ అన్నారు. వారు జీఎస్టీ రేట్ల తగ్గింపు ప్రయోజనాలను వినియోగదారులకు అందించడానికి చురుగ్గా ముందుకు వస్తున్నారని ఆయన తెలిపారు. చాలా చోట్ల సంస్కరణలకు ముందు, సంస్కరణల తరువాత.. ఇలా ధరల్లో పోలికలను తెలిపే బోర్డులను అందరికీ కనిపించేటట్లు ప్రదర్శిస్తున్నారని ప్రధానమంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు.

'నాగరిక్ దేవోభవ' (పౌరులు దేవుళ్లతో సమానం) అనే స్ఫూర్తి కొత్త తరం జీఎస్టీ సంస్కరణల్లో సూటిగా వ్యక్తం అవుతోందని ప్రధానమంత్రి చెప్పారు. ఆదాయపు పన్నులో ఊరటకు జీఎస్టీ తగ్గింపులను కూడా కలుపుకొంటే, గత ఏడాది కాలంగా తీసుకున్న నిర్ణయాలతో దేశ ప్రజలకు రూ.2.5 లక్షల కన్నా ఎక్కువ మొత్తమే ఆదా అవుతుందని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. అందుకే దీనిని తాను 'బచత్ ఉత్సవ్' (పొదుపు ఉత్సవం)గా అభివర్ణిస్తున్నానని ప్రధానమంత్రి ఉద్ఘాటించారు.

'అభివృద్ధి చెందిన భారత్' లక్ష్యాన్ని సాధించాలంటే స్వయంసమృద్ధి బాటలో ముందుకు సాగడానికి తిరుగులేని నిబద్ధతను చాటుకోవాల్సిన అవసరం ఎంతయినా ఉందని శ్రీ మోదీ స్పష్టం చేశారు. భారత్‌ను స్వయంసమృద్ధి మార్గంలో దూసుకుపోయేటట్లు చేయడంలో ప్రధాన బాధ్యత ఎంఎస్ఎంఈల.. మన దేశ సూక్ష్మ, చిన్న, కుటీర పరిశ్రమలపై.. ఉందని ఆయన అన్నారు. ప్రజల అవసరాలను గమనించి వాటినన్నింటినీ తీర్చేందుకు, ఆ వస్తువులు, సేవలను దేశంలోనే తయారు చేసేందుకు వీలు ఉన్నప్పుడు వాటిని మన దగ్గరే ఉత్పత్తి చేసి తీరాలని ఆయన ఉద్ఘాటించారు.

తగ్గించిన జీఎస్టీ, సులభతరంగా మార్చిన ప్రక్రియలు దేశ ఎంఎస్ఎంఈలు, చిన్న తరహా పరిశ్రమలతో పాటు కుటీర వాణిజ్య సంస్థలకు కూడా చెప్పుకోదగ్గ స్థాయిలో ప్రయోజనాలను అందిస్తాయని ప్రధానమంత్రి చెప్పారు. ఈ సంస్కరణలు ఆయా సంస్థల అమ్మకాలకు ఊతాన్నివ్వడమే కాకుండా పన్నుల భారాన్ని కూడా తగ్గిస్తూ, రెండు విధాల ప్రయోజనాలను సమకూరుస్తాయని ఆయన అన్నారు. ఎంఎస్ఎంఈలపైన పెద్ద ఆశలు పెట్టుకొన్నామనీ, భారతదేశ సమృద్ధి శిఖర స్థాయిలో ఉన్న వేళ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఎంఎస్ఎంఈలు చరిత్రాత్మక పాత్రను పోషించాలనీ ప్రధానమంత్రి చెప్పారు. భారత్‌లో తయారీ, ఉత్పాదనల నాణ్యత ఒకప్పుడు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందాయనీ, మన ఉత్పాదనలు శ్రేష్ఠమైనవిగా ఉన్నాయనీ శ్రీ మోదీ అన్నారు. ఆ గౌరవాన్ని మళ్లీ దక్కించుకోవాల్సిన అవసరం ఉందనీ, చిన్న పరిశ్రమలు రూపొందించే ఉత్పాదనలు అత్యున్నత స్థాయి ప్రపంచ ప్రమాణాలకు తప్పకుండా సాటి రావాలనీ విజ్ఞప్తి చేశారు. భారత తయారీ ప్రక్రియ గౌరవంతో, శ్రేష్ఠత్వంతో అన్ని ప్రమాణాలనూ అధిగమించాలనీ, భారతీయ ఉత్పాదనల నాణ్యత మన దేశానికి ప్రపంచంలో గుర్తింపుతో పాటు ప్రతిష్ఠను తప్పక పెంచాలనీ ఆయన సూచించారు. ఆసక్తిదారులంతా ఇదే ధ్యేయంతో పనిచేయాలని ప్రధానమంత్రి పిలుపునిచ్చారు.

స్వదేశీ మంత్రం భారత స్వాతంత్ర్య పోరాటాన్ని శక్తిమంతం చేసినట్లుగానే, సమృద్ధి దిశగా త్వరత్వరగా అడుగులు వేసేలా దేశానికి ఉత్సాహాన్ని అందిస్తుందని ప్రధానమంత్రి అభివర్ణించారు. విదేశీ వస్తువులు అనేకం మనకు తెలియకుండానే మన నిత్య జీవనంలో భాగం అయిపోయాయనీ, ప్రజలు వారి జేబులోని దువ్వెన విదేశంలో తయారైందా, లేక స్వదేశంలో తయారైందా అనే సంగతినైనా గ్రహించని సందర్భాలే ఎక్కువని ఆయన అన్నారు. ఇలా ప్రతిదానికీ ఆధారపడిపోవడాన్నుంచి బయటపడాల్సిన అవసరం ఉందని శ్రీ మోదీ స్పష్టం చేశారు. మన దేశ యువత కష్టపడి, చెమటోడ్చి ఇండియాలోనే తయారు చేసిన ఉత్పాదనలను కొనండి అంటూ ప్రజలను ప్రధానమంత్రి కోరారు. ప్రతి కుటుంబం స్వదేశీకి ప్రతీకగా నిలవాలి, ప్రతి దుకాణమూ దేశీయంగా తయారు చేసిన వస్తువులతోనే కళకళలాడాలి అని ఆయన పిలుపునిచ్చారు. "నేను స్వదేశీ వస్తువులనే కొంటాను", "నేను స్వదేశీ వస్తువులనే అమ్ముతాను".. ఇలా చెబుతూ స్వదేశీ విషయంలో నిబద్ధతను సగర్వంగా చాటుకోండి అంటూ ప్రజలను ప్రధానమంత్రి ప్రోత్సహించారు. ఈ మనస్తత్వం దేశంలో ప్రతి ఒక్కరిలో ఇమిడిపోయి తీరాలని ఆయన అన్నారు. ఈ విధమైన మార్పు భారత్ అభివృద్ధిని వేగవంతం చేస్తుందని ఆయన తెల్చి చెప్పారు. ఆత్మనిర్భర్ భారత్‌తో పాటు స్వదేశీ ప్రచార ఉద్యమాలను క్రియాశీలంగా సమర్థించడానికి అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలూ తమ ప్రాంతాల్లో తయారీకి పూర్తి శక్తితోనూ, ఉత్సాహంతోనూ ఉత్తేజాన్ని నింపాలనీ, పెట్టుబడికి అనుకూలమైన వాతావరణాన్ని కల్పించాలనీ ఆయన విజ్ఞప్తి చేశారు. కేంద్రం, రాష్ట్రాలు కలిసికట్టుగా ముందడుగు వేసినప్పుడు స్వయంసమృద్ధ భారత్ కల నెరవేరుతుందనీ, ప్రతి రాష్ట్రం అభివృద్ధి చెందుతుందనీ, భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందనీ ఆయన స్పష్టం చేశారు. ప్రధానమంత్రి తన ప్రసంగాన్ని ముగించే ముందు, దేశ ప్రజలకు జీఎస్టీ బచత్ ఉత్సవ్‌తో పాటు నవరాత్రి శుభ సందర్భంగా హృదయపూర్వకంగా శుభాకాంక్షలు తెలిపారు.

# పరువునష్టం కేసులపై కీలక వ్యాఖ్యలు చేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22:సుప్రీంకోర్టు ఇవాళ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. పరువునష్టం కేసులను నేర చట్టాల నుంచి విముక్తి కల్పించాలన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. పరువునష్టం పేరుతో క్రిమినల్ కేసులు దాఖలు అవుతున్న సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో కోర్టు ఈ రకమైన వ్యాఖ్యలు చేసింది. పరువునష్టం కేసులను డీక్రిమినలైజ్ చేయాల్సిన సమయం ఆసన్నమైనట్లు సుప్రీం ధర్మాసనం అభిప్రాయపడింది. జస్టిస్ ఎంఎం సుంద్రేశ్, జస్టిస్ సతీష్ చంద్ర శర్మతో కూడిన ధర్మాసనం ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. ద వైర్ ఆన్‌లైన్ పోర్టల్‌కు సమన్లు జారీ చేసిన కేసులో దాఖలైన పిటీషన్‌ను విచారిస్తూ కోర్టు ఈ రకంగా స్పందించింది.

జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ ప్రొఫెసర్ అమితా సింగ్ .. ద వైర్ వెబ్‌సైట్‌పై పరువునష్టం కేసును వేసింది. ఫౌండేషన్ ఫర్ ఇండిపెండెంట్ జర్నలిజం దాఖలు చేసిన కేసులో అమితా సింగ్‌కు కోర్టు నోటీసులు జారీ చేసింది. వాదనల సమయంలో పరువునష్టం కేసులను నేర చట్టాల నుంచి తొలగించాల్సిన సమయం ఆసన్నమైందని జస్టిస్ సుంద్రేశ్ అన్నారు. ద వైర్ వెబ్‌సైట్ తరపున వాదిస్తున్న సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ కోర్టు చేసిన వ్యాఖ్యలను సమర్థించారు.

భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 356 ప్రకారం పరువునష్టం కేసులను నేర చట్టాల ప్రకారం పరిష్కరించనున్నారు. గతంలో ఐపీసీ సెక్షన్ 499 కింద ఈ చట్టాలను విచారించేవారు. జేఎన్‌యూ ప్రొఫెసర్ అమితా సింగ్ ఆధ్వర్యంలో 2016లో వర్సిటీపై ఓ రిపోర్టు తయారైంది. వర్సిటీలో వ్యవస్థీకృత సెక్స్ రాకెట్ జరుగుతున్నట్లు ఆ రిపోర్టులో పేర్కొన్నారు. 200 పేజీలు ఉన్న ఆ రిపోర్టుపై ద వైర్ వెబ్‌సైట్ కథనాన్ని రాసింది. జేఎన్‌యూ అడ్మినిస్ట్రేషన్‌కు కూడా ఆ రిపోర్టును సమర్పించినట్లు కథనంలో పేర్కొన్నారు. వర్సిటీపై రిపోర్టు తయారు చేయడంలో ప్రొఫెసర్ సింగ్ కీలక పాత్ర పోషించినట్లు కథనంలో రాశారు. దీంతో ఆ ప్రొఫెసర్ క్రిమినల్ డిఫమేషన్ కేసును దాఖలు చేశారు.

# సైబర్ నేరగాళ్ల ఉచ్చులో ఎంపీ భార్య.. డిజిటల్ అరెస్ట్ పేరుతో రూ.14 లక్షలు కొట్టేసిన కేటుగాళ్లు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22: ఈ మధ్యకాలంలో 'డిజిటల్ అరెస్ట్ 'బాధితుల సంఖ్య పెరిగిపోతున్నది. అమాయకులే కాదు, చదువుకున్న వాళ్లు, సమాజంలో పలుకుబడి ఉన్న వ్యక్తులూ సైబర్ నేరగాళ్ల బారిన పడుతున్నారు. తాజాగా కర్ణాటక కు చెందిన ఓ ఎంపీ భార్య కూడా నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకున్నారు. సైబర్ నేరగాళ్లు ఆమెను బెదిరించి రూ.14 లక్షలు దోచుకున్నారు.

ముంబై సైబర్ డిపార్ట్‌మెంట్ అధికారినంటూ చిక్కబళ్లాపూర్ ఎంపీ కే సుధాకర్ భార్య ప్రీతికి ఓ వ్యక్తి కాల్ చేశాడు. సద్బుత్‌ఖాన్ అనే వ్యక్తి ఆమె పత్రాలు ఉపయోగించి, క్రెడిట్ కార్డ్ పొందాడని ఆ కాలర్ పేర్కొన్నాడు. దాంతో చట్టవిరుద్ధమైన లావాదేవీలు చేశాడని బెదిరించాడు. తాము సద్బుత్‌ఖాన్‌ను అరెస్టు చేశామని, అతడు ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో మీ పేరు చెప్పాడని ప్రీతిని భయపెట్టాడు.

డాక్యుమెంట్లు ధ్రువీకరించేందుకు వీడియో కాల్ చేయాలని, లేకపోతే అన్ని ఖాతాలను నిలిపివేస్తామని బెదిరించాడు. తాము చెప్పినట్లు చేస్తే ఎలాంటి సమస్య ఉండదని, రూ.14 లక్షలు పంపించాలని ఆ కేటుగాడు ఆమెను ఒప్పించాడు. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం ఆ డబ్బును మళ్లీ రీఫండ్ చేస్తామని చెప్పాడు. అతడి మాట విని డబ్బు పంపగానే కాల్ కట్ అయ్యింది.

ఆ తర్వాత తాను మోసపోయినట్లు గ్రహించిన ప్రీతి.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆగస్టు 26న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అయితే బాధితురాలి ఫిర్యాదుతో వేగంగా స్పందించిన సైబర్ క్రైమ్ పోలీసులు ప్రీతి పోగొట్టుకున్న డబ్బును రికవరీ చేశారు. వెంటనే నిందితుల ఖాతాను ఫ్రీజ్ చేసి, ఆర్బీఐ అనుమతితో బాధితురాలి ఖాతాలో రీఫండ్ చేశారు.

కాగా సైబర్ కేటుగాళ్లు డిజిటల్ అరెస్టుల పేరిట కొత్త తరహాలో ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నారు. సమాజంలో తమ ప్రతిష్ఠ దెబ్బతింటుందనే భయం, కుటుంబసభ్యులపై ప్రభావం వంటి భయాలవల్ల చాలామంది నేరగాళ్ల బెదిరింపులకు తలొగ్గుతున్నారు.

# మధిర వంద పడకల ఆస్పత్రిని వెంటనే ప్రారంభించాలి : నున్న నాగేశ్వరరావు



ఖమ్మం, సెప్టెంబర్ 22: మధిర నియోజకవర్గ కేంద్రంలో నిర్మించిన వంద పడకల ఆస్పత్రిని వెంటనే ప్రారంభించాలని సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు అన్నారు. సోమవారం సీపీఎం పార్టీ బృందం ఆస్పత్రిని సందర్శించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధిరలో రూ.34 కోట్ల వ్యయంతో నిర్మించిన 100 పడకల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి రెండు సంవత్సరాలుగా ప్రారంభానికి నోచుకోలేదన్నారు. రాజకీయ కారణాల వల్లే ఈ ఆస్పత్రిని ప్రారంభించడం లేదని, దీనిని వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. పాలకుల నిర్లక్ష్యం వల్ల ఆస్పత్రి ఇంకా నిరుపయోగంగానే ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

కొత్త ఆస్పత్రిని ప్రారంభించక పోవడం వల్ల పాత ఆస్పత్రిని కూడా పట్టించుకోవడం లేదన్నారు. సరైన సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, చిన్న అనారోగ్యానికైనా ఖమ్మం వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కొత్త ఆస్పత్రిని ప్రారంభించకపోతే భవిష్యత్‌లో ప్రజలను సమీకరించి ప్రత్యక్ష ఉద్యమాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, జిల్లా కమిటీ సభ్యులు శీలం నరసింహారావు, పట్టణ కార్యదర్శి పడకండి మురళి, నాయకులు అనుమోలు భాస్కరరావు, తెలబ్రోలు రాధాకృష్ణ, పెంటి వెంకటరావు పాల్గొన్నారు.

# నిర్దిష్ట లక్ష్యం, పట్టుదలతో కృషిచేసిన వారి భవిష్యత్తు ఉజ్వలం

## – డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి, రచయిత, వ్యక్తిత్వ వికాస నిపుణులు



హైదరాబాద్, సెప్టెంబర్ 22:నిర్దిష్టమైన లక్ష్యంతో పట్టువదలని కృషిని నమ్మిన వ్యక్తుల భవిష్యత్తు ఉజ్వలంగా వెలుగొందుతుందని ప్రముఖ రచయిత, వ్యక్తిత్వ వికాస నిపుణులు లయన్: కెప్టెన్: డాక్టర్: బుర్ర మధుసూదన్ రెడ్డి అన్నారు. ఈ రోజు గంగాధర మండల కేంద్రంలోని వివేకానంద విద్యాసంస్థలో భారతీయస్కౌట్స్ అండ్ గైడ్స్ మూడు రోజుల శిక్షణ శిబిర ముగింపు సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన దినచర్యను అలవర్చుకున్న యువత అసాధ్యాలను సుసాధ్యం చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సదలవాట్లను అనుసరించి వేకువజామున 4 గంటలకు నిద్ర లేచి చదువుపై శ్రద్ధ చూపిన విద్యార్థులు తమ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు పొంది ఉన్నత చదువుల వైపు ఆకర్షితులు అవుతారని అన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణతో నాయకత్వ లక్షణాలు, జట్టుతో కలిసి పని చేయడం, సక్రమ దినచర్య, క్రీడా స్ఫూర్తి, సోదరభావం, నిస్వార్థ సేవా గుణం, క్రమశిక్షణ, శారీరక మానసిక దృఢత్వం లాంటివి అలవడతాయని అన్నారు. శిబిర నిర్వాహకులు స్కౌట్ మాస్టర్ మల్లేశం మాట్లాడుతూ మూడు రోజుల శిబిర నివేదిక వివరించారు. ఈ సందర్భంగా చొరవ చూపిన ఉత్తమ తల్లిదండ్రులు, వివిధ పోటీల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినీవిద్యార్థులకు పతకాలతో పాటు సర్టిఫికెట్లు ముఖ్య అతిథి చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ముఖ్య అతిథిని నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

# 'కోయగూడెం ఆశ్రమ పాఠశాల వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి'



ఖమ్మం, సెప్టెంబర్ 20:టేకులపల్లి మండలంలోని కోయగూడెం ఆశ్రమ పాఠశాల వార్డెన్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ బృందం డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం గిరిజన శాఖ నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ప్రాజెక్ట్ ఆఫీసర్ పీఓ రాహుల్‌కు వినతి పత్రం అందజేశారు. పోరుబాట యాత్రలో భాగంగా కోయగూడెం ఆశ్రమ పాఠశాలను పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం ఇటీవలే సందర్శించింది. పరిశీలనలో అనేక సమస్యలు వెలుగులోకి రాగా వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ తెలిపారు. అధికారులు తూతు మంత్రంగా నోటీసులు ఇస్తామనే పేరుతో చేతులు దులుపుకున్నారే తప్పా ఎలాంటి పరిష్కారం చూపలేదని విమర్శించారు. మరుగుదొడ్లు శుభ్రంగా లేకుండా ఉండడం, విద్యార్థులు స్నానం చేసే వద్ద దుర్వాసన రావడం, వంటలు చేసేందుకు కట్టెలు వాడకం చేసి గ్యాస్ బిల్లులు తీసుకోవడం వంటి పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు.

గిరిజన శాఖ నిబంధనల ప్రకారం ఎస్జీటీ, క్రాఫ్ట్, పీఈటీలకు మాత్రమే వార్డెన్ల బాధ్యతలు ఇవ్వాల్సి ఉండగా ఎక్కడా కూడా ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎం లకు వార్డెన్ బాధ్యతలు ఇవ్వలేదని, కానీ కేవలం కోయగూడెం ఆశ్రమ పాఠశాలలో గిరిజన శాఖ నిబంధనలను తుంగలో తొక్కి కావాలనే వార్డెన్ గా నియామకం చేసి కంటిన్యూగా ఈ ఎల్ ఎఫ్ ఎల్ హెచ్‌ఎంకు మాత్రమే ఎందుకు వార్డెన్ బాధ్యతలు ఇస్తున్నారని ప్రశ్నించారు. గిరిజన శాఖ తీసుకువచ్చిన ఉద్దీపన నిర్వహణలో భాగంగా తెలుగు పాఠ్యాంశాలను విద్యార్థులకు బోధించకుండా కాలయాపన చేస్తున్నాడని, దీంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నట్లు తెలిపారు. గిరిజన శాఖ నిబంధనల ఉల్లంఘనలపై ఏటీడీఓ, డీడీ అధికారులు స్పందించాలని వారు డిమాండ్ చేశారు. పీఓని కలిసిన బృందంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నేతలు మునిగెల శివ, బానోత్ నరేందర్, మోహన్ ఉన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

## – జిల్లా అదనపు కలెక్టర్ మాధురి




సంగారెడ్డి సెప్టెంబర్ (నేటి నిజం ప్రతినిధి)సంగారెడ్డి జిల్లా సమీకృత కార్యాలయాల సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం జరిగింది. ఈ ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 33 దరఖాస్తులు అందాయని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాధురి వివరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాధురి, డి.ఆర్.ఓ పద్మజా రాణి కలిసి అర్జీదారుల నుండి నేరుగా దరఖాస్తులను స్వీకరించారు. అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులకు పంపిణీ చేశారు . ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ...అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. దరఖాస్తులను పరిష్కరించడంలో ఆలస్యం జరగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అన్ని శాఖల అధికారులను ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

# ఇండిగో విమానంలో ఎలుక.. మూడు గంటలు ఆలస్యంగా టేకాఫ్

లక్నో, సెప్టెంబర్ 20:ఇండిగో విమానంలో ఎలుక కనిపించింది. దీంతో ప్రయాణికులను దించి వేశారు. ఆ విమానాన్ని పూర్తిగా తనిఖీ చేసి ఎలుకను పట్టుకున్నారు. ఈ నేపథ్యంలో మూడు గంటలు ఆలస్యంగా ఆ విమానం బయలుదేరింది. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో ఈ సంఘటన జరిగింది. ఇండిగో ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం సోమవారం మధ్యాహ్నం 2.10 గంటలకు ఢిల్లీ నుంచి కాన్పూర్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నది. మధ్యాహ్నం 2.50 గంటలకు తిరిగి ఢిల్లీకి ఆ విమానం బయలుదేరాల్సి ఉన్నది.

కాగా, ఇండిగో విమానంలోకి ప్రయాణికులు ఎక్కారు. అయితే అందులో ఎలుక ఉండటాన్ని ఒక ప్రయాణికుడు గమనించాడు. విమాన సిబ్బందిని అలెర్ట్ చేశాడు. దీంతో ప్రయాణికులందరినీ విమానం నుంచి ఖాళీ చేయించారు. విమానాశ్రయం లాంజ్‌లో వేచి ఉండమని వారిని కోరారు.

మరోవైపు ఎలుక కోసం ఆ విమానంలో తనిఖీ చేశారు. గంటన్నర పాటు వెతికిన తర్వాత దానిని పట్టుకున్నారు. ఈ నేపథ్యంలో ఆ విమానం మూడు గంటలు ఆలస్యంగా ఢిల్లీకి తిరుగు ప్రయాణమైంది. కాన్పూర్ విమానాశ్రయం డైరెక్టర్ సంజయ్ కుమార్ దీనిని ధృవీకరించారు. ఇండిగో విమానంలో ఎలుకను గుర్తించిన నేపథ్యంలో పూర్తి తనిఖీ తర్వాతే బయలుదేరేందుకు అనుమతించినట్లు వెల్లడించారు.

# శ్రీవారికి 15 బంగారు పతకాలు, రెండు వెండి తట్టలు విరాళం

తిరుపతి, సెప్టెంబర్ 20:లియుగ ప్రత్యక్షదైవం తిరుమల వేంకటేశ్వరస్వామికి ఓ భక్తుడు రూ.1.80 కోట్లు విలువైన బంగారు పతకాలను అందజేశారు. శ్రీ సంస్థాన్ గోకర్ణ పర్తగాళి జీవోత్తమ మఠం మఠాధిపతి విద్యాదీశ తీర్థ స్వామిజీ రూ.1.80 కోట్లు విలువైన 15 బంగారు పతకాలు, రెండు వెండి తట్టలను సోమవారం శ్రీవారికి తిరుమలలో బహుకరించారు. ఈ మేరకు శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో పేష్కార్ రామకృష్ణకు వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో బొక్కసం ఇన్ ఛార్జ్ గురురాజ్ స్వామి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా టీటీడీకి మల్టీ పర్పస్ క్లీనింగ్‌కు ఉపయోగించే రూ.20 లక్షలు విలువైన రోస్సరి ప్రొఫెషనల్ కంపెనీకి చెందిన రాస్ స్ట్రీట్ ఆర్వో 1500 రైడ్ ఆన్ స్వీపర్ మెషిన్‌ను విరాళంగా అందించింది. శ్రీవారి ఆలయం ముందు అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తిరుపతి జీఎం పత్రి శ్రీనివాస్ మెషిన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈవో సోమన్నారాయణ, ఆరోగ్యాధికారి డాక్టర్ మధుసూదన్, యూనియన్ బ్యాంక్ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అర్హులందరికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలి : ఆత్రం పరమేశ్వర్



నార్నూర్, సెప్టెంబర్ 22 :వరులందరికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని రాజ్ గోండు సేవా సమితి మండల అధ్యక్షుడు ఆత్రం పరమేశ్వర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట 18 గ్రామాలకు చెందిన గిరిజనులు, రాజ్ గోండు సేవా సమితి నాయకుల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొదటి విడతగా ప్రభుత్వం అర్హులకు ఇళ్లను ఇవ్వకుండా వారికి అనుకూలంగా ఉన్నవారికి ఇందిరమ్మ ఇల్లు కేటాయించినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో అవకతవకలు జరిగాయని మండిపడ్డారు. అధికారులు కేటాయించిన ఇండ్ల సర్వే చేపట్టి అర్హులను గుర్తించి న్యాయం చేయాలన్నారు. గ్రామానికి ఒకటి రెండు ఇల్లు కాకుండా అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిడం మాల్కు పటేల్, బాదిరావు పటేల్, మాన్కు పటేల్, అమృత్ పటేల్, అంబాజీ పటేల్, జాలిం షాప్ పటేల్, జగన్నాథ్ రావు, జాలింషావ్, జంగు, కొద్దు, లక్ష్మణ్, పరశురాం, వసంతరావు తదితరులు ఉన్నారు.

# సర్కార్ బడుల్లో నో అడ్మిషన్ బోర్డు పెట్టాలన్నదే నా లక్ష్యం.. నారా లోకేశ్ కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22: పాఠశాల విద్యపై ఏపీ మంత్రి నారా లోకేశ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మన బడి-మన భవిష్యత్తు కార్యక్రమం కింద విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయుల నియామకం, గదుల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ప్రాథమిక పాఠశాలలను ప్రాథమికోన్నత పాఠశాలల్లో విలీనం చేసే అంశంపై ఎమ్మెల్యే చదలవాడ అరవింద్ బాబు అడిగిన ప్రశ్నకు నారా లోకేశ్ సమాధానమిచ్చారు.

ఒక తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలన్నదే తమ లక్ష్యమని లోకేశ్ తెలిపారు. మన బడి-మన భవిష్యత్తు కార్యక్రమం కింద విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయుల నియామకం, గదుల నిర్మాణం చేపడుతున్నామని పేర్కొన్నారు. పాఠశాల భవనాల నిర్మాణం కోసం దాతల సహకారం కోరుతున్నామని వెల్లడించారు. భవనాలపై దాతల పేర్లు ఉండేలా చూస్తామని చెప్పారు.

ఇక ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ఫలితాలు రావాలనేది తమ ఉద్దేశమని నారా లోకేశ్ తెలిపారు. అన్ని ప్రభుత్వ బడుల్లో సీట్లు నిండి.. నో ఆడ్మిషన్ బోర్డులు పెట్టాలన్నదే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రస్తుం రాష్ట్రంలో సుమారు వంద బడుల్లో అలాంటి పరిస్థితి ఉందని పేర్కొన్నారు.

# జీఎస్టీ సంస్కరణలు...ఆత్మనిర్భరత దిశగా బొగ్గురంగంలో మార్పులు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22:న్యూఢిల్లీలో నిర్వహించిన జీఎస్టీ కౌన్సిల్ 56వ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను బొగ్గు మంత్రిత్వ శాఖ స్వాగతించింది. ఈ నిర్ణయాలు బొగ్గు రంగానికి సంబంధించిన పన్ను స్వరూపంలో ముఖ్య మార్పులను తీసుకువచ్చాయి. ఈ సంస్కరణలు బొగ్గు రంగం ఆత్మనిర్భరతను సాధించే దిశగా ఒక పరివర్తనాత్మక ముందడుగును సూచించడంతో పాటు, బొగ్గు ఉత్పత్తిదారు సంస్థలకూ, బొగ్గు వినియోగదారు సంస్థలకూ లాభసాటిగా ఉండే ఒక సంతులిత వైఖరిని ప్రతిబింబిస్తున్నాయి.

**జీఎస్టీ కౌన్సిల్ 56వ సమావేశంలో తీసుకున్న ముఖ్య నిర్ణయాలు**

జీఎస్టీ పరిహార సెస్సు తొలగింపు: బొగ్గుపై ఇంతకు ముందున్న టన్నుకు రూ.400 చొప్పున ఉన్న పరిహార సెస్సును కౌన్సిల్ తీసేసింది.

బొగ్గుపై జీఎస్టీ రేటు పెంపు: బొగ్గుపై జీఎస్టీ రేటును 5 శాతం నుంచి 18 శాతానికి పెంచారు.

బొగ్గు ధరల విధానంపైనా, విద్యుత్తు రంగంపైనా కొత్త సంస్కరణలు ప్రసరించే ప్రభావం మొత్తంమీద పన్ను భారాన్ని చెప్పుకోదగ్గ స్థాయిలో తగ్గిస్తోంది. జీ6 మొదలు జీ17 గ్రేడుల బొగ్గుకు ఈ తగ్గింపు ఒక్కో టన్నుకు రూ.13.40 నుంచి రూ.329.61 దాకా ఉంటుంది. విద్యుత్తు రంగానికి వస్తే, సగటు తగ్గింపు ప్రతి టన్నుకు రూ.260 వరకు ఉంటుంది. ఇది విద్యుత్తు ఉత్పాదనకు అయ్యే ఖర్చులో ఒక్కో కేడబ్ల్యూహెచ్‌కు 17 నుంచి 18 పైసల మేర తగ్గింపునకు సమానంగా లెక్కకు వస్తుంది.

బొగ్గులో అన్ని గ్రేడులకూ పన్ను భారాన్ని క్రమబద్ధీకరించడంతో సమానత్వానికి పెద్ద పీటను వేసినట్లయింది. ఇది ఇంతకు ముందు ఒక్కొక్క టన్నుకు రూ.400 ఏకధర (ఫ్లాట్ రేట్) పరిహార సెస్సుకు స్వస్తి పలుకుతుంది. పాత పరిహార సెస్సు తక్కువ నాణ్యత కలిగిన బొగ్గుకూ, తక్కువ ధర కలిగిన బొగ్గుకూ అమలవుతూ, వ్యత్యాస ప్రభావాన్ని ఏర్పరిచింది. ఉదాహరణకు, జీ11 నాన్ కోకింగ్ బొగ్గును పెద్ద ఎత్తున ఉత్పత్తి చేసే కోల్ ఇండియా లిమిటెడ్‌కు 65.85 శాతం పన్ను భారం ఉంటే, జీ2 బొగ్గుకు 35.64 శాతం పన్ను ఉండింది. ఈ సెస్సును తొలగించడంతో అన్ని కేటగిరీలకూ ఇక ఏకరీతిన 39.81 శాతం పన్ను అమలవుతుంది.

సెస్సును ఉపసంహరించిన నిర్ణయం, పోటీ పడే స్థాయిని సమానమైందిగా మార్చడమే కాకుండా జీఎస్టీ పరిహార సెస్సును ఒక్కో టన్నుకు రూ.400 చొప్పున ఏక ధర (ఫ్లాట్ రేటు)ను అమలుచేయడమనేది తక్కువ గ్రేడు కలిగిన భారతీయ బొగ్గుతో పోలిస్తే ఉన్నత స్థూల కెలోరిఫిక్ వేల్యూను కలిగి ఉండే దిగుమతి బొగ్గుకు అయ్యే ఖర్చే తక్కువగా ఉన్న ఇదివరకటి స్థితిని కూడా నివారిస్తోంది. దీంతో ఈ నిర్ణయం ఆత్మనిర్భర్ భారత్‌కు ఊతాన్నిచ్చి, దిగుమతిని అడ్డుకోగలదని స్పష్టమవుతోంది. ఈ సంస్కరణ భారత స్వయంసమృద్ధిని బలపరుస్తూ, అనవసర బొగ్గు దిగుమతులను అరికట్టగలుగుతుంది.

బొగ్గుపై జీఎస్టీ రేటును 18 శాతానికి పెంచి, విలోమ సుంకం తాలూకు వ్యత్యాసాన్ని ఈ సంస్కరణలు దూరం చేశాయి. ఇదివరకు, బొగ్గుపై 5 శాతం జీఎస్టీ ఉండింది. బొగ్గు వాణిజ్య సంస్థలు ఉపయోగించుకొనే ఇన్‌పుట్ సర్వీసులపై అధిక జీఎస్టీ రేట్లు వర్తించేవి. ఇవి సాధారణంగా 18 శాతంగా ఉండేవి. ఈ అసమానత్వం కారణంగా, బొగ్గు వాణిజ్య సంస్థలు తక్కువ ఉత్పాదనపై జీఎస్టీ చెల్లింపులను జరపవలసి వచ్చినందువల్ల, ఉపయోగించని ట్యాక్స్ క్రెడిట్ రూపంలో పెద్ద మొత్తం ఖాతాల్లో పోగయింది.

రిఫండుకు ఏర్పాటు లేకపోవడంతో ఈ మొత్తం పెరుగుతూ పోయి, విలువైన ధనరాశి వినియోగానికి ఆటంకాన్ని కలిగిస్తూ వచ్చింది. ఇకపై ఉపయోగించుకోని సొమ్మును రాబోయే కాలంలో జీఎస్టీ పన్ను బాధ్యతను తీర్చడానికి ఖర్చు పెట్టొచ్చు. తత్ఫలితంగా నగదు లభ్యతకు పడిన ముడి విడిపోతుంది. బొగ్గు వాణిజ్య సంస్థలకు ఉపయోగించని జీఎస్టీ క్రెడిట్ పెద్ద మొత్తంలో పోగుపడిన కారణంగా వాటిల్లుతున్న నష్టాలను తగ్గించుకోవడానికి ఇది తోడ్పడి, ఆర్థిక స్థిరత్వం మెరుగవుతుంది.

జీఎస్టీ రేట్లలో 5 శాతం నుంచి 18 శాతం పెంపు చోటుచేసుకున్నప్పటికీ, సంస్కరణల సమగ్ర ప్రభావాన్ని చూస్తే మాత్రం అంతిమ వినియోగదారులకు పన్ను భారం తక్కువగానే ఉంటుంది. దీంతో పాటు, విలోమ పన్ను స్వరూపంలో దిద్దుబాటూ వీలవుతుంది. ఇది నగదు లభ్యతను పెంచి, వక్రతలను దూరం చేయడంతో పాటు బొగ్గు ఉత్పత్తిదారు సంస్థలకు నష్టాలు పెద్ద మొత్తంలో వాటిల్లడాన్ని అడ్డుకొంటుంది కూడా.

జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయాలు భారతదేశ స్వయంసమృద్ధిని పటిష్ఠపరుస్తూ బొగ్గు రంగంపై సానుకూల ప్రభావాన్ని ప్రసరిస్తుందని భావిస్తున్నారు. ఈ నిర్ణయాలు బొగ్గు ఉత్పత్తిదారు సంస్థలకు మద్దతిస్తూ, వినియోగదారులకు లాభసాటిగా ఉంటూ, ఆత్మనిర్భర్ భారత్ దృష్టికోణానికి అనుగుణంగా కూడా ఉండబోతున్నాయి. దీంతో ఈ నిర్ణయాలు సమతౌల్య సంస్కరణలుగా నిలవడం ఖాయం.

# వికసిత్ భారత్ - మై భారత్ ఏ 2047 అంశంపై చిత్రకళా పోటీలు... ఉత్సాహంగా పాల్గొన్న చిత్రకారులు



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22:సేవా పర్వ్ 2025లో భాగంగా సాలార్ జంగ్ మ్యూజియం, సాంస్కృతిక వనరులు-శిక్షణ కేంద్రం (సీసీఆర్టీ) సంయుక్తంగా "వికసిత్ భారత్ ? మై భారత్ ఏ 2047" అనే అంశంపై సోమవారం చిత్రలేఖన శిబిరాన్ని నిర్వహించింది. చిత్రలేఖనం శిబిరంలో 500 మందికి పైగా యువ కళాకారులు పాల్గొన్నారు. భారతదేశ భవిష్యత్తు దృష్టికోణాన్ని యువ కళాకారుల కళాత్మక భావనల ద్వారా వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సేవా పర్వ్ 2025: వీక్షిత్ భారత్ కే రంగ్, కాలా కే సంగ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ శిబిరం.. 2047 నాటికి దేశం ఎలా ఉండాలనే దానిపై యువ కళాకారులు చిత్రలేఖన రూపంలో వ్యక్తపరచేందుకు ప్రోత్సహించడమే లక్ష్యంగా పెట్టుకుంది. హైదరాబాద్‌కు చెందిన పాఠశాల, కళాశాల విద్యార్థులు సహా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన 500 మందికి పైగా కళాకారులు ఈ శిబిరంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సాలార్ జంగ్ మ్యూజియం డైరెక్టర్ ప్రియాంక మేరీ ఫ్రాన్సిస్, ఐఏఎస్, సీసీఆర్టీ అధికారులు, ప్రాంతీయ అధికారి శ్రీమతి సౌందర్య కౌశిక్, సాలార్ జంగ్ మ్యూజియం ప్రదర్శన నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు. బహుమతులు, విజేతల జాబితాను, నగదు బహుమతులనూ త్వరలో ప్రకటించనున్నారు.

# కార్మికులను నమ్మించి మరోసారి వంచించిన కాంగ్రెస్.. టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షుడు కొప్పుల ఈశ్వర్

**-34శాతం కాదు కేవలం 12.8 శాతమే.. గత ఏడాది కన్నా రూ.6.5 కోట్లే ఎక్కువ**

**-కార్మికుల ఆశలపై నీళ్లు చల్లిన కాంగ్రెస్**

**-రూ.ఐదు లక్షల లాభాల వాటా రావాల్సింది వచ్చింది రూ.లక్ష 95 వేలే..**

కరీంనగర్, సెప్టెంబర్ 22: సింగరేణి కార్మికులను మరోసారి నమ్మించి కాంగ్రెస్ ప్రభుత్వం వచించిందని మాజీ మంత్రి, టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షుడు కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఆర్థిక సంవత్సరం భారీ బొగ్గు ఉత్పత్తి సాధించి గణనీయంగా లాభాలు ఆర్జించిన కార్మికులు గతంలో కన్నా ఈసారి తమకు రెట్టింపు లాభాల వాటా వస్తుందని ఎంతగానో ఆశించారని వారి ఆశలపై నీళ్లు చల్లుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రెండవసారి మోసం చేసిందని ఆయన ఆరోపించారు.

రూ.6394 కోట్ల లాభాలు ఆర్జిస్తే అందులో రూ.2,360 కోట్లపై వాటా ఇవ్వడమేంటని ఆయన ప్రశ్నించారు. 34 శాతం వాటా ఇచ్చినట్లు చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం వాస్తవానికి 12.8శాతం మాత్రమే కార్మికులకు వాటా ఇచ్చిందని ఆయన ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరం ఇదేవిధంగా మోసం చేసిన కాంగ్రెస్ మరోసారి కార్మికులను వంచనకు గురి చేసిందన్నారు. గత ఏడాది రూ.796 కోట్ల లాభాల వాటా చెల్లిస్తే ఈసారి రూ.802.5 కోట్లు మాత్రమే రూ.6.5 కోట్లు అదనంగా చెల్లిస్తుందని ఆయన పేర్కొన్నారు. వాస్తవ లాభాలపై కార్మికులకు రూ.ఐదు లక్షల వరకు లాభాల వాటా రావాల్సి ఉండగా కేవలం రూ.1,95,000 మాత్రమే చెల్లిస్తున్నారని ఆయన విమర్శించారు.

గత ఏడాది వాస్తవ లాభాలపై 16శాతమిచ్చి 33 శాతంగా పేర్కొన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఈసారి 12.8 శాతమిచ్చి 34 శాతం ఇచ్చినట్లుగా గొప్పలు చెప్పుందని ఆయన విమర్శించారు. కేసీఆర్ హయాంలో వాస్తవ లాభాలపై కార్మికులకు వాటా చెల్లించారని, సింగరేణి అభివృద్ధి కోసం అని ఎలాంటి నిధులను పక్కన పెట్టలేదని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ చేసిన మోసంపై ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు కార్మిక సంఘాలన్నీ ఏకమై నిరసనలు ఆందోళనలు తెలపాలని ఆయన పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీ చేసిన మోసంపై మంగళవారం సింగరేణి వ్యాప్తంగా అన్ని బొగ్గు గనులపై కార్మికులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపాలని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి కోరారు.

# మొరాకోలోని ప్రవాస భారతీయులతో ముచ్చటించిన రక్షణమంత్రి ఆపరేషన్ సింధూర్ సమయంలో దేశ సంయమనం, దృఢ సంకల్పంపై ప్రస్తావన




న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22:మొరాకోలోని రాబాత్ లో సెప్టెంబర్ 21, 2025న ప్రవాస భారతీయులతో రక్షణమంత్రి శ్రీ రాజ్ నాథ్ సింగ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అక్కడి ప్రవాస భారతీయులు, ఆపరేషన్ సింధూర్ సమయంలో భారత ఆర్మీ తీసుకున్న నిర్ణయాత్మక చర్యలను ప్రశంసించింది. పహల్గామ్ లో అమాయక ప్రజలపై జరిగిన హింస తర్వాత, సాయుధ దళాలు పూర్తి సన్నద్ధతతో ఉన్నాయని, ప్రతిస్పందనకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చినట్లు రక్షణమంత్రి తెలిపారు.

ఉద్రిక్తతలు పెంచకుండా భారత్ సంయమనంతో వ్యవహరించిందన్నారు. భారత్ నియంత్రణ వైఖరిని తెలిపేందుకు రామచరితమానస్ లోని ఒక సూక్తిని ఉదహరిస్తూ, "మేం ధర్మం చూసి కాదు, కర్మను అనుసరించి దాడి చేశాం" అని పేర్కొన్నారు.

ప్రవాస భారతీయులతో ముచ్చటిస్తూ... ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో గత పదేళ్లలో భారత్ సమగ్రాభివృద్ధిని సాధించినట్లు శ్రీ రాజ్ నాథ్ సింగ్ తెలిపారు. ప్రపంచ, భౌగోళిక రాజకీయ సవాళ్లున్నప్పటికీ, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదిగిందని, ప్రపంచ దేశాల్లో 11 నుంచి 4వ స్థానానికి చేరుకుందని, త్వరలో మూడో స్థానానికి చేరే అవకాశం ఉందన్నారు.

భారతదేశంలో డిజిటల్ మార్పులు, నైపుణ్య ఆధారిత ఆర్థిక వ్యవస్థలో పురోగతి, గత దశాబ్దంలో 18గా ఉన్న యూనికార్న్ స్టార్టప్స్ ప్రస్తుతం 118కి పెరిగాయన్నారు. దేశ రక్షణ రంగం గణనీయంగా వృద్ధి చెందిందని, రూ.1.5 లక్షల కోట్ల విలువైన వృద్ధిని సాధించిందని, రూ.23,000 కోట్లకు పైగా రక్షణ ఉత్పత్తులను 100కు పైగా దేశాలకు ఎగుమతి చేస్తుందని వెల్లడించారు.

శ్రమ, అంకితభావం, నిజాయితీకి ప్రవాస భారతీయులు ప్రతీక అని, నిజానికి భారతీయుల వ్యక్తిత్వం అలానే ఉంటుందని శ్రీ రాజ్ నాథ్ సింగ్ ప్రశంసించారు. అంతర్జాతీయ సర్వమత సమ్మేళనంలో స్వామి వివేకానంద మాటలను ఆయన గుర్తు చేసుకుంటూ... భారత సంస్కృతిలో ఒక వ్యక్తిని నిర్వచించేది వ్యక్తిత్వమేనన్నారు. బలమైన ఆర్థిక పునాదులు, పెరుగుతున్న సైనిక బలం కారణంగా ప్రపంచస్థాయిలో భారత్ ప్రతిష్ఠ పెరుగుతుందని ప్రవాస భారతీయులు భావిస్తున్నారు.

# ముంపు బాధితులకు తక్షణ సాయం, భోజన వసతి కల్పించాలి : ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 22:ప్రభుత్వం ముంపు బాధితులకుతక్షణ సాయం, భోజన వసతిని కల్పించాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం హయత్‌నగర్ డివిజన్‌లో ముంపునకు గురైన బంజారాకాలనీలో ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సామ తిరుమలరెడ్డి, వివిధ శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పర్యటించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని విభాగాల అధికారులను సమన్వయ పరుచుకుంటూ బాధితులకు తక్షణ సాయం కింద రూ.20 వేలు చెల్లించాలని, వారికి భోజన సౌకర్యం కల్పించాలని కోరారు. ఇంజాపూర్ నుంచి వచ్చే వరదనీటి ప్రవాహం వల్లే బంజారాబస్తీ మునిగిపోయిందన్నారు. నూతన ట్రంక్‌లైన్ అతి త్వరలోనే ప్రారంభమవుతుందని, పనులు సకాలంలో పూర్తయితే ఎలాంటి ఇబ్బందులు ఉండబోవని స్పష్టంచేశారు.

ముంపు బాధితులకు తనవంతు సహాయసహకారాలు అందిస్తానని, ఎవరూ అధైర్యవడవద్దని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ మాజీ అధ్యక్షుడు గుడాల మల్లేష్ ముదిరాజ్, సీనియర్ నాయకులు భాస్కర్ సాగర్, గంగని నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

# అమ్మలకు, చెల్లెళ్లకు తదుపరి తరం జీఎస్టీ సంస్కరణలతో బహుమతినందించిన మోదీ ప్రభుత్వం

**- కేంద్ర హోంశాఖ, సహకార మంత్రిత్వశాఖ మంత్రి అమిత్ షా**

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22:నవరాత్రి పర్వదిన సందర్భంగా దేశంలోని అమ్మలకు, చెల్లెళ్లందరికీ మోదీ ప్రభుత్వం తదుపరితరం జీఎస్టీ సంస్కరణలను బహుమతిని అందించిందని కేంద్ర హోంశాఖ, సహకార మంత్రిత్వశాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ఎక్స్ మాధ్యమంలో కేంద్ర హోంశాఖ, సహకారశాఖ మంత్రి చేసిన పోస్టులో.. "నవరాత్రి పండుగ సందర్భంగా దేశంలోని తల్లులందరికీ, చెల్లెళ్లందరికీ మోదీ ప్రభుత్వం తదుపరి తరం సంస్కరణల బహుమతిని అందించింది. దేశ ప్రజలకు ప్రధాని శ్రీ మోదీ చేసిన జీఎస్టీ సంస్కరణల వాగ్దానం నేటి నుండి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చింది. ఈ సంస్కరణలు 390కి పైగా వస్తువులపై పన్ను భారం తగ్గింది. ఆహారం, గృహోపకరణాలు, గృహ నిర్మాణ సామగ్రి, వాహనాలు, వ్యవసాయం, బొమ్మలు, క్రీడలు, హస్తకళలు, విద్య, వైద్యం, భీమా వంటి రంగాలపై జీఎస్టీ ఉపశమనం.. ప్రజల జీవితాల్లో ఆనందాన్ని తేవడమే కాకుండా వారి పొదుపును పెంచుతుంది" అని తెలిపారు.

ఆత్మనిర్భర భారత్ సంకల్పాన్ని సాకారం చేయడంలో జీఎస్టీ సంస్కరణలు కీలకపాత్ర పోషిస్తాయని కేంద్రమంత్రి శ్రీ అమిత్ షా అన్నారు. దేశాన్ని ఉద్దేశించి ప్రధాని శ్రీ మోదీ ఇచ్చిన ప్రసంగంలో.. స్వదేశీ ఉత్పత్తులను వాడకాన్ని పెంచాలని పిలుపునిచ్చారని, ఈ సంస్కరణలు ఆత్మనిర్భర భారత్ ను ఎలా బలోపేతం చేస్తాయో వివరించారని తెలిపారు. వ్యవసాయం, వైద్యం, వస్త్రాలు, మ్యాన్ మేడ్ ఫైబర్ వంటి రంగాల్లో జీఎస్టీని తగ్గించడం ద్వారా తయారీని పెంచేందుకు సహాయపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ రోజువారీ జీవితంలో స్వదేశీ ఉత్పత్తుల వాడకాన్ని పెంచడం ద్వారా స్వావలంబన దేశాన్ని రూపొందించడానికి దోహదపడవచ్చని చెప్పారు.

మధ్య తరగతి ప్రజల ఆదాయాన్ని పెంచేందుకు మోదీ ప్రభుత్వం అనేక అవకాశాలను కల్పిస్తూ.. వారి పొదుపు శక్తిని నిరంతరం పెంచేలా జీఎస్టీ సంస్కరణలను అమలు చేస్తోందని కేంద్ర హోంమంత్రి తెలిపారు. నిత్యావసరాలు, ఆరోగ్య సంరక్షణ ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్ పరికరాలు, విద్యా వస్తువులపై జీఎస్టీ రేట్లను గణనీయంగా తగ్గించడం వల్ల వారి ఆదాయాలతోపాటు పొదుపు మొత్తాలను పెంచేందుకు ప్రోత్సహిస్తుందని అన్నారు.

పేదలు, యువత, రైతులు, మహిళలకు సేవ చేయాలనే ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దృఢ సంకల్పానికి తాజా జీఎస్టీ సంస్కరణలు నిదర్శనమని శ్రీ అమిత్ షా పేర్కొన్నారు. ఈ సంస్కరణలతో అనేక వస్తువులపై జీఎస్టీ రేట్లు భారీగా తగ్గడంతో ప్రజల ఖర్చులు మరింత తగ్గనున్నాయి. ఇది ప్రపంచంలోనే అత్యంత సంపన్న దేశంగా మారే దిశగా దేశ వృద్ధి చక్రాన్ని మరింత వేగంగా పరుగులు పెట్టించనుంది. అనేక పాల ఉత్పత్తులపై జీఎస్టీ తొలగింపు లేదా సబ్బు, టూత్ బ్రష్, టూత్ పేస్ట్, హెయిర్ ఆయిల్, షాంపూ వంటి నిత్యావసరాలపై తాజా జీఎస్టీ సంస్కరణలు ప్రతి ఇంటిలో సంతోషానిచ్చే బహుమతిని తెస్తుందని కేంద్ర హోం మంత్రి, సహకార మంత్రి శ్రీ అమిత్ షా అన్నారు. జీవిత బీమా, ఆరోగ్య బీమా, వయోవృద్ధుల పాలసీలు, ప్రాణాలను రక్షించే 33 మందులు, డయాగ్నొస్టిక్ కిట్లపై జీఎస్టీ తొలగింపు నుంచి ఆక్సిజన్, శస్త్రచికిత్సా పరికరాలు, వైద్య, దంత, పశు వైద్య పరికరాలపై జీఎస్టీ తగ్గింపు వరకూ.. ఈ సంస్కరణలు ప్రజల పొదుపుల్లో చారిత్రాత్మక పెరుగుదలకు దారితీయనుంది. వ్యవసాయ పరికరాలు, ఎరువుల రంగాల్లో జీఎస్టీ తగ్గింపుతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇకపై ప్రజలు వాహనాలను కొను గోలు చేసే ముందు ఒకటికి రెండు సార్లు ఆలోచించాల్సిన అవసరం లేదు.

ఎందుకంటే తాజా జీఎస్టీ సంస్కరణలు ఆత్మ నిర్భర భారత్ కు దోహదపడనున్నాయి.




# మోటార్ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సైదులు

నల్గొండ, సెప్టెంబర్ 20:తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రైవేట్ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కట్టంగూర్ మండలంలోని ఇస్మాయిల్ పల్లి గ్రామానికి చెందిన పెంజర్ల సైదులు ఎన్నికయ్యారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన రాష్ట్ర మహాసభలో సైదులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ రంగంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మహాలక్ష్మి పథకంతో జీవన భృతి కోల్పోయిన ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం ప్రకటించిన రూ.12 వేలు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, గుర్తింపు కార్డులు అందజేయాలన్నారు. తన నియమకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# సంఘవికాసంతోనే దేశాభివృద్ధి

**-విశ్వ శాంతికి భారతీయ విలువలే ఆధారం- ఆర్ ఎస్ ఎస్ విభాగ్ సహసంఘచాలక్ డాక్టర్ రమణాచారి.**



కరీంనగర్, సెప్టెంబర్ 22: (నేటినిజం ప్రతినిధి) సంఘవికాసంతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని ఆర్ఎస్ఎస్ విభాగ్ సహసంఘచాలక్ డాక్టర్ చక్రవర్తుల రమణాచారి అన్నారు. కరీంనగర్లోని స్థానిక శిశు మందిర్ లో వారం రోజులపాటు జరుగుతున్న శిక్షావర్గ ప్రారంభ ఉపన్యాస కార్యక్రమంలో డాక్టర్ రమణాచారి మాట్లాడారు. దేశాన్ని మాతృభూమిగా ప్రేమించే స్వయంసేవకులలో అనుశాసనం, దేశభక్తి, సేవాభావం వంటి గుణాల నిర్మాణం ఆర్ఎస్ఎస్ శాఖలో నిర్మాణం జరుగుతుందని వివరించారు. 1925 నుండి సంఘ శాఖల ద్వారా వ్యక్తి నిర్మాణము జరుగుతుందని ఆయన తెలిపారు. శరీరంలోని ప్రతి కణం శరీర ధారుఢ్యానికి ఏ విధంగా పనిచేస్తాయో, దేశంలోని సామాన్య వ్యక్తులు కూడా దేశ అభివృద్ధిలో పాలుపంచుకోవాలని అన్నారు. భారతదేశ పరమ వైభవం ద్వారానే విశ్వ కళ్యాణం, విశ్వశాంతి సాధ్యపడుతుందని చెప్పారు. శిక్షణకు వచ్చిన స్వయంసేవకులు గ్రామీణ క్షేత్రాలలో సంఘ శాఖల నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ విభాగ్ కార్యవాహ సత్యనారాయణ , మల్లోజుల కిషన్ రావు, శిక్షణకు వచ్చిన స్వయం సేవకులు, తదితరులు పాల్గొన్నారు

# రోడ్ల నిర్మాణంకు ప్రభుత్వం పచ్చజెండా

**-ప్రభుత్వ విప్ కృషితో రోడ్లకు మహర్దశ తీరనున్న వేములవాడ నియోజకవర్గ ప్రజలు ఇబ్బందులు**

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 20:(నేటినిజం ప్రతినిధి): ప్రతినిధి వేములవాడ నియోజకవర్గంలోని పలు రోడ్లకు మహర్దశ పట్టనుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో,రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృషితో వేములవాడ నియోజకవర్గ పరిధిలోని పలు రోడ్లను హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హేచ్ ఏమ్) పథకం కింద రోడ్ల నిర్మాణాలు చేపట్టనున్నారు. ఇటీవల హామ్ విధానంలో రోడ్ల నిర్మాణనికి రాష్ట్ర ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. ఇందులో భాగంగా వేములవాడ నియోజకవర్గ పరిధిలోని వేములవాడ కొరుట్ల ప్రధాన రహదారి వయా మర్రిపల్లి, మర్రిగడ్డ చందుర్తి రుద్రనీగి,పోశాని పేట కథలపూర్ మిదిగా కొరుట్ల వరకు చందుర్తి మండల పరిధిలో చందుర్తి–మోత్కురావు పేట మధ్య 10 కిలోమీటర్లు,కొనరావుపేట మండల పరిధిలోమామిడిపల్లి నిజామాబాద్ గ్రామాల మధ్య 4.70 కిలోమీటర్లు,బావుసాయిపేట వెంట్రావుపేట గ్రామాల మధ్య 3.30 కిలోమీటర్లు,వట్టిమల్ల నిమ్మపల్లి గ్రామాల మధ్య 2.90 కిలోమీటర్ల, వేములవాడ బ్రాంచ్ రోడ్డు వయా చింతల్టన,వేములవాడ మున్సిపల్ వరకు 4.30 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు.త్వరలోనే నిధులు మంజూరు కాబడి రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు.

# శ్రీ దేవీ అమ్మవారి సేవలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 20:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ సోమవారం స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయానికి రాగానే అర్చకులు, వేద పండితులు స్వస్తి తో స్వాగతం పలికారు. అనంతరం కళ్యాణ మండపంలో వేద పండితులు, ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ప్రోటోకాల్ ఏఈఓ జి. అశోక్ కుమార్, ఆలయ పర్యవేక్షకులు జి. శ్రీనివాస్ శర్మలు ప్రభుత్వ విప్ కు శేష వస్త్రం కప్పి, లడ్డూ ప్రసాదం అందజేశారు.నవరాత్రి సందర్భంగా మొదటి రోజు శ్రీ శైలపుత్రి అవతారంలో ఉన్న అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ వేములవాడ రాజన్న సన్నిధిలో దేవి నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభం అయ్యాయని, మొదటి రోజు అమ్మవారు శ్రీ శైలపుత్రి అవతారంలో భక్తులకు దర్శనం ఇస్తున్నార న్నారు.భక్తులు నియోజకవర్గ వ్యాప్తంగా అమ్మవారి ప్రతిమలు నెలకొల్పి ఘనంగా పూజలు చేస్తున్నారన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా పూలనే పూజించే బతుకమ్మను పండుగ నిన్నటి రోజున ఘనంగా ప్రారంభమయ్యాయని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వేములవాడ రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నాం అని స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రుల సమక్షంలో రాజన్న ఆలయ అభివృద్ధికి పునాది రాయి వేసుకొని నేడు పనులు చేసుకున్నాం అని, 47 కోట్లతో రోడ్డు వెడల్పు,76 కోట్లతో ఆలయ అభివృద్ధి చేస్తున్నాం అన్నారు. శృంగేరి జగద్గురు శ్రీశ్రీశ్రీ భారతి తీర్థ మహాస్వామి, శృంగేరి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతి స్వామివారులను కలసి రాజన్న ఆలయ అభివృద్ధి విస్తరణ పై వారి సలహాలు సూచనలు తీసుకున్నామన్నారు. త్వరలో తెలంగాణ రాష్ట్రంలో స్వామివారి విజయ యాత్ర ఉన్నందున వేములవాడ రాజన్న సన్నిధికి రావాల్సిందిగా ఆహ్వాన పత్రిక అందజేశాం అని తెలిపారు. స్వామివారిని దర్శించి వారి ప్రవచనాలను మన ప్రాంత ప్రజలకు అందజేయాలని కోరడం జరిగిందన్నారు.ప్రజలందరికీ దేవి నవరాత్రి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.



# టాటా మ్యాజిక్ యూనియన్ ఎన్నిక



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 20:(నేటినిజం ప్రతినిధి): సిరిసిల్ల టాటా మ్యాజిక్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని టాటా మ్యాజిక్ సంఘ సభ్యులు ఆధ్వర్యంలోసోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పాముల రాజేందర్, ఉపాధ్యక్షులుగా తడకమడ్ల రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మరిపెల్లి శంకర్, కోశాధికారిగా విశ్వనాధుల వినోద్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సభ్యులు వల్లాల వెంకటేశం, పొన్నం శ్రీనివాస్, పాశం రాజారత్నం, జమ్మికుంట శ్రీనివాస్, సిరిసిల్ల టాటా మ్యాజిక్ కొత్త బస్టాండ్ సంఘ సభ్యులందరూ పాల్గొన్నారు.

# బతుకమ్మ విశిష్టతను చాటి చెప్పిన అల్ఫోర్స్ బతుకమ్మ మహోత్సవ్

కరీంనగర్, సెప్టెంబర్ 22: (నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్ నెక్స్ట్ మైదానంలో వైభవంగా నిర్వహించినటువంటి "అల్ఫోర్స్ బతుకమ్మ మహోత్సవ్" వేడుకలకు ముఖ్య అతిథిగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి, వారి సతీమణి డాక్టర్ వనజ నరేందర్ రెడ్డి హాజరై వారుమాట్లాడారు. ప్రారంభానికి ముందు వారు ప్రాంగణంలో అందంగా ఏర్పాటు చేసినటువంటి నవదుర్గ విగ్రహానికి పూజ కార్యక్రమాన్ని నిర్వహించి బతుకమ్మకు పూజ చేసి వేడుకలను అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బతుకమ్మ వైభవాన్ని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలి అని తెలుసుకోవడం ద్వారా తెలంగాణ లో నెలకొన్నటువంటి పరిస్థితులను చక్కగా అర్థం చేసుకుంటారని వారు చెప్పారు. బతుకమ్మ పండుగ ద్వారా ప్రకృతిని ఆరాధిస్తామని మరియు ప్రకృతిలో నెలకొన్నటువంటి పలు రుగ్మతులను తొలగించడానికి ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలని ఆ కృషి చేయాలని వారు సూచించారు.వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చడమే కాకుండా వారి యొక్క విషయాలను బతుకమ్మల ద్వారా దుర్గాదేవికి విన్నవించడం జరుగుతుందని వారు చెప్పారు.చిన్నా పెద్ద తేడా లేకుండా మహిళలందరూ ఉత్సాహంగా కోలాహలం నడుమ బతుకమ్మ వేడుకలను చాలా ఘనంగా జరుపుకోవడం చివరి రోజున సద్దుల బతుకమ్మ పేరుతో సామూహికంగా నిర్వహించడం ద్వారా సమాజంలో కళా వైభవం కనబడుతుందని వారు చెప్పారు.తెలంగాణ రాష్ట్రానికి గొప్ప వైభవాన్ని తెచ్చిపెట్టే పండుగ బతుకమ్మ అని ఈ పండుగ మన దేశంలోనే కాకుండా విదేశాల్లో సైతం చాలా ఉత్సాహంతో జరుపుకుంటారని వారు తెలిపారు. బతుకమ్మ వైభవాన్ని చాటి చెప్పేందుకు ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ఆకాశమే హద్దుగా వేడుకలను నిర్వహించుకోవడం హర్షించదగ్గ విషయమని వారు చెప్పారు.వేడుకుల సందర్భంగా ప్రదర్శించినటువంటి పలు నృత్యాలు, కోలాటలు, పాటలు ప్రత్యేక ఆకర్షణగా ఉండడమే కాకుండా బతుకమ్మ వైభవాన్ని చాటి చెప్పాయి.కార్యక్రమంలో వివిధ పాఠశాలల, కళాశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు×



# దసరా, దీపావళి పండుగలకు బంపరాఫర్..

## చేనేత వస్త్రాలపై 40 శాతం డిస్కౌంట్

అమరావతి, సెప్టెంబర్ 22: దసరా, దీపావళి పండుగల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ హ్యాండ్లూమ్ వీవర్స్ కో ఆపరేటివ్ సొసైటీ బంపరాఫర్ ప్రకటించింది. చేనేత వస్త్రాలపై 40 శాతం డిస్కౌంట్ ఇస్తున్నట్లు తెలిపింది. ఈ ఆఫర్ ద్వారా చేనేత వస్త్రాల అమ్మకాలు పెరిగి అటు నేతన్నలకు, ఇటు ధరలు తగ్గడంతో వినియోగదారులకు మేలు జరుగుతుందని ఏపీ చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత తెలిపారు. ఆప్కో ఆఫర్‌ను ఉపయోగించుకుని చేనేత వస్త్రాల వినియోగాన్ని ప్రోత్సహించాలని కోరారు.ఆప్కో తయారుచేయిస్తున్న చేనేత ఉత్పత్తుల వినియోగాన్ని పెంచేందుకు ఏపీ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకొంటున్నది. చేనేత వస్త్రాల వాడకాన్ని పెంచేందుకు రాష్ట్రంలో, జాతీయ స్థాయిలో చేనేత బజార్లను నిర్వహిస్తున్నది. ఈ క్రమంలోనే ఆప్కో సంస్థకు ఉత్పత్తులను సరఫరా చేసే సొసైటీల్లో పనిచేసే నేత కార్మికుల జీతాలు, ప్రాసెసింగ్ చార్జీలను పెంచుతూ ఇటీవల ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనిద్వారా ఒక్కో కార్మికుడు అదనంగా రూ.3000 వరకు లబ్ధి పొందుతున్నారు.

# 23న భాగ్య లక్ష్మి అమ్మ వారి దేవాలయం వద్ద బిజెపి బతుకమ్మ వేడుకలు



హైదరాబాద్ సెప్టెంబర్ 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );బిజెపి తెలంగాణ రాష్ట్ర మహిళా మోర్చా ఆధ్వర్యంలో, ఈ నెల 23 సాయంత్రం 3:00 గంటలకు, భాగ్యనగరంలోని భాగ్య లక్ష్మి అమ్మ వారి దేవాలయం వద్ద బతుకమ్మ వేడుకలు జరుపుతున్నట్లు బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ ఎన్. రాంచందర్ రావు ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యాలంలో బతుకమ్మ సంబరాలకు సంబంధించిన పోస్టర్ ను రాంచందర్ రావు గారి చేతుల మీదుగా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో బిజెపి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతంరావు , ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి , ఎమ్మెల్సీ అంజిరెడ్డి , బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తీక రెడ్డి , బిజెపి తెలంగాణ రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు డా. మేకల శిల్పారెడ్డి ,, సునీతా రెడ్డి,, రాష్ట్ర మహిళా మోర్చ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీ నిరుద్యోగ యువత రెండు పథకాలకు దరఖాస్తు చేసుకోవాలి : మైనార్టీ సంక్షేమ అధికారి గౌస్ హైదర్

వరంగల్, సెప్టెంబర్ 22: రాష్ట్రంలో మైనార్టీల టీజీఎంఎఫ్‌సీ ఆర్థిక సహాయం కింద ఫకీర్, దూదేకుల, ఇతర దుర్బల ముస్లిం వర్గాలకు చెందిన నిరుద్యోగ యువతకు 'ఇందిరమ్మ మైనార్టీ మహిళా యోజన (మహిళలకు మాత్రమే), 'రేవంత్ అన్నా కా సహారా' రెండు పథకాల ద్వారా మోపెడ్లు, బైకులు, ఈ–బైకులు పంపిణీ ద్వారా ఆర్థిక పురోగతి పెంపొందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన రెండు పథకాలను ప్రారంభించినట్లు హనుమకొండ జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి గౌస్ హైదర్ తెలిపారు. ఇందిరమ్మ మైనార్టీ మహిళా యోజన జిల్లాల్లో మైనార్టీ మహిళలకు (వితంతువులు, విడాకులు పొందినవారు, అనాథలు మొదలైనవారు) మహిళలకు మాత్రమే ఒక్కసారిగా రూ.50 వేల ఆర్థిక సహాయం అందించడం, ఈ పథకం కింద చిన్న వ్యాపారాలు, వీధి వ్యాపారాలు మొదలైన వాటికి ప్రోత్సాహం, రేవంత్ అన్నా కా సహారా మిస్కీను కే లియోయే కోసం అర్హత కలిగిన మైనార్టీ లబ్ధిదారులకు మోపెడ్‌లు, బైక్, ఈ–బైక్ రూపంలో ఒకేసారిగా గ్రాంట్ ద్వారా ఆర్థిక సహాయం అర్హత కలిగిన మైనార్టీ అభ్యర్థులకు ఒక్కొక్కరికీ రూ.లక్ష విలువగల మోపెడ్, బైక్,ఈ–బైక్ ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. హనుమకొండ జిల్లాలో అర్హత, ఆసక్తిగలవారు ఆన్‌లైన్ పోర్టల్ https//tgobmmsnew.cgg.gov.in ద్వారా తమ దరఖాస్తులు నమోదు చేసుకోవచ్చని, అక్టోబర్ 6 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు ముగుస్తాయని తెలిపారు.

# బాధిత కుటుంబాలను పరామర్శించిన చల్మెడ లక్ష్మీ నరసింహారావు



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 20:(నేటినిజం ప్రతినిధి): చందుర్తి మండలం మూడపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కొమ్ము శంకర్ తల్లి కనకమ్మ ఇటీవల అనారోగ్యం తో మృతి చెందగా, ఇదే గ్రామానికి చెందిన ఎండీ. ఖదీర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పరామర్శించి ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలియజేశారు. వారి వెంట మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య సింగిల్ విండో ఛైర్మన్ కిషన్ రావు, తిప్పని శ్రీనివాస్ గ్రామ నాయకులు బాపు రావు, అంజి బాబు సీనియర్ నాయకులు డప్పుల అశోక్, పెంటయ్య, ఏనుగుల శ్రీనివాస్, ఈర్లపల్లి రాజు, రమేష్ రావు, దుమ్మా అంజయ్య, ఇస్మాయిల్, గంగాధర్, రాములు తదితరులు ఉన్నారు.

# రాజీవ్ పార్క్ అభివృద్ధి కి 3 కోట్ల నిధులు మంజూరు చేయించిన జగ్గారెడ్డి, నిర్మల

**-కన్సల్టెన్సీ, డిజైన్ అండ్ ఆర్కిటెక్ట్ ప్రతినిధులతో కలిసి రాజీవ్ పార్క్ ను పరిశీలించిన జగ్గారెడ్డి, నిర్మల**

**-పదేళ్ల పాటు సౌకర్యాలు లేకుండా నిరుపయోగంగా ఉన్న రాజీవ్ పార్క్**

**-నెల రోజుల్లో అన్ని సౌకర్యాలతో సంగారెడ్డి ప్రజలకు అందుబాటులో కి రాజీవ్ పార్క్**

**-వచ్చే నెలలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మళ్లీ రాజీవ్ పార్క్ ప్రారంభోత్సవం**

సంగా రెడ్డి సెప్టెంబర్ 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); అండ్ ఆర్కి టెక్ట్ , కన్సల్టేషన్ ప్రతినిధుల తో రాజీవ్ పార్క్ ను విజిట్ చేసిన జగ్గారెడ్డి , నిర్మల... ఈ అందర్భంగా జగ్గ రెడ్డి మాట్లాడుతూ రాజీవ్ పార్క్ అభివృద్ధి కి 3 కోట్లు మంజూరు అయ్యాయి....2004 ఎమ్మెల్యే అయిన తర్వాత 2005 లో బొబ్బిలి కుంట కు అనుకుని ఉన్న స్థలం లో రాజీవ్ పార్క్ కు శంకుస్థాపన చేయడం జరిగిందని,ముఖ్యమంత్రులు రాజశేఖర్ రెడ్డి , రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి ల హయాం లో పనులు జరిగి పూర్తయ్యాయిన్నారు. సమైక్య రాష్ట్రం లో పదేళ్ల పాటు ఎమ్మెల్యే గా ఉన్నప్పుడు ఈ పార్క్ లో మ్యూజికల్ ఫౌంటేన్, చిల్డ్రన్ పార్క్, ప్లే ఏరియా ఏర్పాటు చేశాను. 2014 నుండి 2018 వరకు పార్క్ కుంటుబడి పోయింది... చాలా మంది ఈ విషయం లో కాంప్లైంట్ చేసినప్పటికీ, ప్రభుత్వం మనది కాదు, ఎమ్మెల్యే గా లేను కాబట్టి ఏమి చేయలేకపోయాను.... నేను మొన్న ఎన్నికల్లో ఓడిపోయినా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది కాబట్టి నిధులు తీసుకువస్తున్ననన్నరు నియోజకవర్గం లో పనులు జరగడం కోసం ప్రోటోకాల్ ఉండాలి అందుకే నిర్మల కు కార్పొరేషన్ పదవి ఇస్తున్నా అని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా చెప్పారు. ఈమధ్య కాలంలో మున్సిపల్ అడ్మనిస్టేషన్ డైరెక్టర్ అండ్ కమిషనర్ శ్రీదేవి నీ కలిశాను.... ఆమెకు రాజీవ్ పార్క్ కోసం 15 కోట్ల రూపాయల ప్రతిపాదనలు ఇవ్వడం జరిగింది.... ఆమె అత్యవసర పనులు కోసం 3 కోట్లు ఇస్తా అనడం తో అందుకు తగ్గ ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరిగింది...3 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి... 3 కోట్ల తో ఏ ఏ పనులు చేయాలో కన్సల్టెంట్, అర్చిటెక్ట్ ప్రతినిధులకు సూచించిన జగ్గారెడ్డి.... పార్క్ లో పెరిగిన గడ్డి నీ తొలగించి లాండ్ స్కేప్ చేయండి.... ఉన్న చెట్ల ను తొలగించకుండా పనులు జరగాలన ఆదేశించారు..

కొత్త గ్రాస్, చిల్డ్రన్ పార్క్, లేటెస్ట్ గా ఏమి చేయొచ్చో చూడండి.... కింద టైల్స్ కాకుండా , మందం ఉన్న తాండూర్ బండలు వేయండి. షో కోసం కాకుండా మన్నిక ఉండాలనీ , లైటింగ్ కూడా షో కోసం కాకుండా మన్నికైన వాం లైటింగ్ ఏర్పాటు చేయండి...

పార్క్ లో ఎక్కువ వెలుతురు ఉండేలా హై మాస్ట్ లైట్స్, దగ్గర దగ్గర గా లైటింగ్ ఏర్పాటు చేయాలి.... ఓల్టేజ్ ఎక్కువ గా ఉన్న లైట్స్ వాడండి.... వర్షం నీరు పార్క్ లో నిలవకుండా ఉండాలి, వెంట వెంటనే బయటకు వెళ్ళాలి.... చిల్డ్రన్ పార్క్ లో ఒక ఫీట్ మేర ఫైన్ సాండ్ ఏర్పాటు చేయాలి.... ఎంట్రెన్స్ లో రౌండ్ ఫౌంటేన్ ఉండాలి, అవి కూడా మన్నిక అయినవి , మంచి లేటెస్ట్ లైటింగ్ తో ఏర్పాటు చేయాలి.... మ్యూజికల్ ఫౌంటెన్ సైతం ఇప్పుడున్న లేటెస్ట్ డిజైన్ తో ఏర్పాటు చేయండి..... జెంట్స్, లేడీస్ కు సెపరేట్ గా 6 వాష్ రూం లు ఏర్పాటు చేయండి.... రాజీవ్ పార్క్ చుట్టూ పది ఫీట్ల మేర ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి..... పార్క్ కు కొత్త ఆర్చ్ ఏర్పాటు చేయండి.... కొత్త జిమ్ పరికరాలు ఏర్పాటు చేయండి, జిమ్ ఏర్పాటు చేసే దగ్గ ర పర్మినెంట్ ఫ్లోర్ ఏర్పాటు చేయాలి.... వాచ్మెన్ రూం ఏర్పాటు చేయండి...

పార్క్ లో సేద తీరేందుకు లేటెస్ట్ స్టోన్ బెంచ్ ఏర్పాటు చేయండని చుచించారు.కొత్తగా 160 కేవీ ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయాల నీ ఎలక్ట్రిసిటీ అధికారులకు సూచన... అక్టోబర్ నెలలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన వుంటుంది.

ఆయన చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయిస్తాం, అక్టోబర్ 25 లో గా పనులు పూర్తి కావాలి.... యుద్ధ ప్రాతిపదికన పొద్దున, రాత్రి రెండు పూటలా పనులు జరగాలి.... ముఖ్యమంత్రి తో పాటు మంత్రి దామోదర్, ఇంచార్జ్ మంత్రి వివేక్ లు హాజరవుతారు.... సంగారెడ్డి ప్రజలకు రాజీవ్ పార్క్ అందుబాటు లో లేక, సరైన సౌకర్యాలు లేక పది సంవత్సరాలు దాటి పోయింది..... ప్రజలకు అన్ని సౌకర్యాలతో రాజీవ్ పార్క్ అందు బాటులో కి రావాలిపిల్లలు ఎంజాయ్ చేసేలా ఫౌంటేన్ ఉండాలి, సాయంత్రం 5 గంటల నుండి 10 గంటల వరకు ఫౌంటేన్ లు వర్క్ మోడ్ లో ఉండాలి....

పాత మ్యూజికల్ ఫౌంటెన్ స్థానం లో మొత్తం కొత్త గా ఏర్పాటు చేయండిపిల్లల కోసం కొత్త గా మ్యాజిక్ పౌంటెన్ ఏర్పాటు చేయాలని కన్సల్టెంట్ ప్రతినిధుల కు సూచనఈనెల 30 న అర్చిటెక్ట్స్ డిజైన్ ఫైనల్ చేసేందుకు హైదరాబాద్ లో కన్సల్టెంట్ ఆఫీస్ లో సమావేశం కావాలని నిర్ణయించారు.

# ప్రేమికులకు శుభవార్త

**-తల్లిదండ్రులను ఎదిరించలేక మృత్యువాత పడుతున్నప్రేమికులు దళిత కళ్యాణ వేదిక అండ**

హైదరాబాద్ సెప్టెంబర్ 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); తల్లిదండ్రులను ఎదిరించలేక ఎంతోమంది ప్రేమికులు మృత్యువాత పడుతున్న నేటిఎ సమాజం లో అలాంటివారి కోసం మేమున్నామంటూ దళిత కళ్యాణ వేదిక ధైర్యాన్ని నింపుతుంది 1991లో స్థాపించబడిన దళిత కళ్యాణ వేదిక నేటికీ ప్రేమికులకు కులాంతర వివాహాలకు 5764 వివాహాలు చేయడమే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందే షాది ముబారక్, కళ్యాణ లక్ష్మి పథకాన్ని కూడా దగ్గరుండి వారికి అందేలా కృషి చేస్తుంది. ఈసందర్భంగా దళిత కళ్యాణ వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు దళితరత్న సేవారత్న రేణిగుంట్ల ఎల్లయ్య మాట్లాడుతూ దళిత కళ్యాణ వేదిక ఆధ్వర్యంలో దేశాంతర కులాంతర మతాంతర వర్ణాంతర అన్ని కులాల వారికి వివాహాలు జరిపిస్తున్నట్లు తెలిపారు ఇది కేవలం సమాజంలోని కుల నిర్మూలన అంటరానితనం కుల వివక్ష వరకట్న నిషేధం రూపుమాపుటకు మా వంతు కృషిగా స్థాపించబడినట్లు ఆయన తెలిపారు ఇప్పటివరకు 5764 వివాహాలు ప్రభుత్వ అధికారులు పెద్దల వివిధ సంఘాల నాయకులు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు 18 సంవత్సరాలు నిండిన స్త్రీలు 21 సంవత్సరం నిండిన పురుషులకు మాత్రమే అవకాశం కల్పించినట్లు ఆయన తెలిపారు. అంతేకాకుండా తమ సంస్థ ద్వారా మళ్లీ పెళ్లి చేసుకోదలచుకున్న వారికి చట్టరీత్యా విడాకులు పొందిన వారు మరియు అకాల మరణంతో చనిపోయిన భార్యను భర్తను కోల్పోయిన అభిలాష గల స్త్రీ పురుషులకు కూడా వివాహము ను చేయబడునని ఆయన తెలిపారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.** RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com